

సీఐడీకి సూపర్‌బజార్ కేసు?

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సూపర్‌బజార్ స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టిన వ్యవహారంపై దర్యాప్తు చేయాల్సిందిగా సీఐడీని కోరాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. సూపర్ బజార్ స్థలాన్ని లీజుకు తీసుకున్న సంస్థ సోహాణి షాపింగ్‌మాల్ ముంబైకు చెందినది కావడం, ఢిల్లీలో ఉన్న బ్యాంకులో తనఖా పెట్టిన నేపథ్యంలో స్థానిక పోలీసుల కంటే సీఐడీకి అప్పగిస్తే బాగుంటుందని డీజీపీ సూచించారు. ఈ నేపథ్యంలో త్వరలో ప్రస్తుత సూపర్‌బజార్ ఇన్‌చార్జి ఎండీ, జిల్లా సహకార అధికారి ప్రవీణ అమరావతిలో సీఐడీ డీజీని కలిసి ఫిర్యాదు చేయనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులపై అనుమానాలు

ఆగమేఘాలపై రూ.400 కోట్లతో నిర్మాణం

- ఏడాదిలోగా పూర్తిచేయాలని లక్ష్యం
- భూములు కోల్పోయేది ఎందరు...
- వారికి పరిహారం ఎలా?
- భోగాపురం విమానాశ్రయానికి వేగంగా చేరుకోవాలంటే నగరంలో ఫ్లైఓవర్లు నిర్మించాలి
- ఆ విషయం పక్కనపెట్టి మాస్టర్‌ప్లాన్ రహదారులు చేపట్టడంపై విమర్శలు



వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొత్తగా చేపట్టబోతున్న 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయ్యేలోగా వీటిని పూర్తి చేయాలనేది లక్ష్యం. అయితే అసలు విమానాశ్రయానికి, ఈ రహదారులకు సంబంధం ఏమిటనేది ఎవరికీ అర్థం కావడం లేదు. వీటికి సుమారు రూ.400 కోట్లు అవసరమని అంచనా వేశారు. అన్ని నిధులు వీఎంఆర్‌డీఏ వద్ద లేవు. అయినా ఆగమేఘాలపై పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

భోగాపురం విమానాశ్రయానికి త్వరగా చేరుకోవాలంటే విశాఖ నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతవాక, మధురవాడ, కొమ్మాది వంటి ప్రధాన జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాల్సి ఉంది. వాటి గురించి ఎవరూ మాట్లాడడం లేదు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడానికి మాస్టర్ ప్లాన్ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. ప్రతిపాదించిన రహదారులలో అడవివరం, శొంఠ్యాం మీదుగా అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని కలిపే మార్గం ఒక్కటే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి ఎక్కువ మందికి ఉపయోగపడుతుంది. ఇక వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన రహదారులన్నీ దాదాపుగా భీమిలి నియోజకకవర్గంలోనే ఉన్నాయి. ఆనందపురం, భీమిలి మండలాల్లో అనేక లేఅవుట్లను కలుపుతూ ఈ మాస్టర్ ప్లాన్ రహదారులు ఉన్నాయి. వీటి నిర్మాణం వల్ల భోగాపురం వైపు ట్రాఫిక్ ఒత్తిడి ఎలా తగ్గుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. గంభీరంలో మాస్టర్ ప్లాన్ రహదారి ప్రతిపాదించారు. దానిని కూడా భోగాపురం విమానాశ్రయానికి లింక్ పెట్టారు. విశాఖ హైవేపై వెళ్లే వారు గంభీరం లోపలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇలా అంతర్జాతీయ విమానాశ్రయం పేరు చెప్పి ఈ మాస్టర్ ప్లాన్ రహదారులను ఆగమేఘాలపై పూర్తి చేయడానికి యత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.400 కోట్ల నిధులు ఎక్కడ?

ప్రతిపాదించిన 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి సుమారు రూ.400 కోట్లు అవసరమని వీఎంఆర్‌డీఏ అధికారులు అంచనా ... మిగతా 6వ పేజీలో

వర్షాకాలంలో ఇసుక కొరత రానివ్వం

- డిపోల్లో 3 లక్షల టన్నులు ముందే నిల్వ చేస్తాం
- రూ.50 లక్షలతో రైతుబజార్లలో పనులు
- త్వరలో ఎనిమిది గ్రామాల్లో భూముల రీసర్వే
- జేసీ కె.మయూర్ అశోక్



విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

వచ్చే వర్షాకాలంలో నగరంలో నిర్మాణ అవసరాలకు కొరత లేకుండా మూడు లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భీమిలి, ముడసర్లోవ, గాజువాక ప్రైవేటు డిపోల్లో లక్ష టన్నుల చొప్పున అందుబాటులో ఉంచాలని నిర్ణయించామన్నారు. వర్షాకాలంలో నదుల్లో ఇసుక తవ్వకాలు జరగవని, ముందే జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. శ్రీకాకుళం, రాజమండ్రిల నుంచి ప్రస్తుతం జిల్లాకు రోజూ మూడు వేల టన్నుల ఇసుక వస్తోందన్నారు. దీంతో ధరలు అదుపులో ఉన్నాయన్నారు.

నగరంలోని ఐదారు రైతుబజార్‌లలో మరుగుదొడ్లు, గేట్లు, ఫ్లోరింగ్, షెడ్లు మరమ్మతులకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లకు ఆదేశాలు ఇచ్చానన్నారు. త్వరలో నాలుగు మండలాల్లో ఎనిమిది గ్రామాల్లో భూముల రీసర్వే చేపడతామన్నారు. దీనికి మూడు నెలలు పడుతుందని, హడావిడి లేకుండా ప్రతి రైతుకు సమాచారం అందించి వారి సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తామన్నారు.

వాట్సాప్‌లోనే ఇంటర్ ఫలితాలు

- పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం - 8లో

దారుణం

ప్రేమోన్మాది ఘాతుకం

- పట్టపగలు తల్లీ, కూతురుపై కత్తితో దాడి
- ఒకరి మృతి, ప్రాణాపాయ స్థితిలో మరొకరు...
- ఉలిక్కిపడిన నగరం
- ఉన్మాద లక్షణాలు ఉన్న వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం
- యువతులతోపాటు తల్లిదండ్రులు కూడా..
- తొలిదశలోనే పోలీసులను సంప్రతిస్తే మేలు
- ఉపేక్షిస్తే ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం


నిందితుడు నవీన్


ఘటనా స్థలంలో లక్ష్మి మృతదేహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని కొమ్మాది స్వయంకృషి నగర్‌లో ప్రేమోన్మాది దుశ్చర్య అందరినీ ఉలికిపాటుకు గురిచేసింది. తనను ప్రేమించడం లేదని యువతిపైనా, పెళ్లికి తిరస్కరించారనే అక్కసుతో ఆమె తల్లిదండ్రులపైనా ఒక యువకుడు బుధవారం పట్టపగలు ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేశాడు. దీంతో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా, యువతి ప్రాణాపాయ స్థితిలో ఉంది. ప్రేమోన్మాది పలుమార్లు అతిగా ప్రవర్తించినప్పటికీ బాధిత కుటుంబం ఒకింత తేలిగ్గా తీసుకోవడమే కొంపముంచింది. సీపీ శంఖబ్రతబాగ్చీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ...ఉన్మాద లక్షణాలతో వ్యవహరించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రేమ పేరిట వేధింపులు, దాడులు నగరంలో ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ఎక్కడైనా పరిచయం కాగానే ప్రేమ పేరుతో ఆకతాయిలు వెంటపడడం, వేధించడం చేస్తున్నారు. తాము చెప్పినట్టు వినకపోతే విచక్షణ కోల్పోయి యువతుల పట్ల తీవ్రంగా స్పందిస్తున్నారు. కొందరైతే ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను బెదిరిస్తున్నారు. ఆరు నెలల కిందట న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరిట ఒక యువతి వెంటపడిన అదే ప్రాంతానికి చెందిన యువకుడు తనను పెళ్లి చేసుకోవాల్సిందేనని ఆమెపై ఒత్తిడిచేశాడు. అందుకు ఆమె నిరాకరించడంతో గొంతుకోసి పరారయ్యాడు.

తాజాగా కొమ్మాది స్వయంకృషి నగర్‌లో మరో ప్రేమోన్మాది బీభత్సం సృష్టించాడు. రాజు, లక్ష్మి దంపతుల కుమార్తె దీపిక (20)కు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం పనసనందివాడ గ్రామానికి చెందిన దమరశింగి నవీన్ (26)కు ఆరేళ్ల కిందట పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ప్రేమ పేరుతో ఆమె వెంటపడుతున్నాడు. ఆమె అంగీకరించకపోవడంతో తీవ్రస్థాయిలో బెదిరించేవాడు. ఇలాంటి పరిస్థితి ఎదురైన వెంటనే యువతి లేదంటే ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉండాల్సింది. అలా చేసినట్టయితే నవీన్‌కు పోలీసులు కౌన్సెలింగ్ చేయడం లేదంటే కేసు నమోదుచేసి కుటుంబ సభ్యుల సమక్షంలో బైండోవర్ చేయడం ద్వారా ఆమె వైపు కన్నెత్తిచూడకుండా చర్యలు తీసుకునేవారు. అప్పటికీ శృతిమించి ... మిగతా 6వ పేజీలో


ఉన్మాది ఘాతుకం
... వార్త మెయిన్‌లో

వీసీ.. విభిన్న శైలి

ఏయూను గాడిన పెట్టడంపై దృష్టి

- గత పాలకులకు భిన్నంగా వ్యవహరిస్తున్న జీపీ రాజశేఖర్
- సమయానికి అత్యధిక ప్రాధాన్యం
- చాంబర్‌లో చిట్‌చాట్‌కు దూరం
- ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు మాత్రమే అవకాశం
- హంగూ, ఆర్భాటం లేకుండా విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు
- వారంలో రెండు, మూడు తరగతులు బోధిస్తున్నట్టు సమాచారం


ఏయూ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వీసీ రాజశేఖర్ (ఫైల్ ఫొటో)


వీసీ రాజశేఖర్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తొలిరోజు నుంచి ఆయన సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత పాలకుల మాదిరిగా ఛాంబర్‌లో కూర్చుని గంటల తరబడి వచ్చిన వారితో మాట్లాడేందుకు ఇష్టపడడం లేదు. వైస్ చాన్సలర్‌ను కలవాలంటే బయట వాళ్లైనా, వర్సిటీకి చెందిన అధికారులైనా సరే విషయ మేమిటో ముందుగా చెప్పాల్సి ఉంటుంది. ముఖ్య మైన అంశం అయితేనే ఆయన మాట్లా డేందుకు అంగీకరిస్తున్నారు. లేదంటే తరువాత చూద్దామంటున్నారు. రిజిస్ట్రార్, రెక్టార్ సహా ప్రిన్సిపాల్స్, డీన్లు, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన అదే విషయం చెబుతున్నారు. ముఖ్యమైన అంశ మైతేనే తన వద్దకు రావాలని, లేదంటే వద్దని సూచిస్తున్నట్టు చెబుతున్నారు. చిన్న చిన్న విషయాలకు రావాల్సిన అవసరం లేదని, వాటిని తనకు మరో పద్ధతిలో తెలియజేస్తే సరిపోతుందంటున్నారు. అలాగే, ఛాంబర్‌లోనే కూర్చుని ఉండిపోకుండా ప్రతిరోజూ కొన్ని విభా గాలను సందర్శిస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలోని కొన్ని విభాగాలతోపాటు దూరవిద్య, సైన్స్ కాలేజీ పరిధిలోని కొన్ని డిపార్టుమెంట్‌లకు ఆయన వెళ్లినట్టు తెలిసింది. అక్కడ సిబ్బందితో మాట్లాడి ఇబ్బందులు, పనితీరులో ఉన్న సమస్యలను ... మిగతా 6వ పేజీలో

స్వయం ఉపాధి రుణాలకు పోటెత్తిన దరఖాస్తులు

వివిధ కార్పొరేషన్ల పరిధిలోని 2,368 యూనిట్లకు 18,984 దరఖాస్తులు

- బీసీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి 17,000 వేలకుపైగా రాక
- వడబోస్తున్న అధికారులు
- యూనిట్ వ్యయంలో 50 శాతం సబ్సిడీ, మరో 50 శాతం రుణం
- త్వరలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- జనరిక్ మెడికల్ స్టోర్స్ ఏర్పాటుకు స్పందన కరువు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంజూరుచేస్తున్న స్వయం ఉపాధి రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. డెయిరీ, చిరు వ్యాపారాలు, వాహన, సేవా రంగాల్లో రాణించాలనుకునే వారికి 50 శాతం సబ్సిడీతో రుణాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఈ రుణాలను ఇవ్వకుండా సంక్షేమ శాఖలను నిర్వీర్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రుణాల మంజూరుకు ముందుకురావడంతో జిల్లాలో వివిధ కులాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో బీసీ, ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు ప్రభుత్వం 2,368 యూనిట్లు మంజూరుచేసింది. వాటి కోసం 18,984 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒక్క బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1,615 యూనిట్లు మంజూరుకాగా, 17,040 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈబీసీ కార్పొరేషన్‌కు 36 యూనిట్లు మంజూరుకాగా 91 మంది, కమ్మ కార్పొరేషన్‌కు కేటాయించిన 14 యూనిట్ల కోసం 23 మంది, రెడ్డి కార్పొరేషన్‌కు కేటాయించిన 40 యూనిట్లకు 357 మంది, ఆర్య, వైశ్య కార్పొరేషన్‌కు కేటాయించిన 17 యూనిట్లకు 523 మంది, క్షత్రియ కార్పొరేషన్‌కు కేటాయించిన 21 యూనిట్లకు 43 మంది, బ్రాహ్మణ ... మిగతా 6వ పేజీలో

8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- భీమిలి క్రాస్ రోడ్డు వద్ద నాలుగు టన్నులు
- గొల్లలపాలెం వద్ద మరో నాలుగు టన్నులు
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు


ఆనందపురం మండలం భీమిలి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

ఆనందపురం/మహారాణిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున ఆనందపురం ఎస్‌ఐ శివ, సిబ్బంది భీమిలి క్రాస్ రోడ్డు వద్ద విశాఖ నుంచి ఆనందపురం వైపు వెళ్లే బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 80 గన్నీ బ్యాగులతో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. డ్రైవర్ భీమిలి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొర్రై గోపాలకృష్ణ (24)ను అదుపులోకి తీసుకుని విచారించారు. మద్దిలపాలెంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, ఆనందపురం పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయించడానికి తరలిస్తున్నట్టు ... మిగతా 6వ పేజీలో

8 నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె?

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖ స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా ఈ నెల 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు తెలిసింది. యాజమాన్యం ఎటువంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా మంగళవారం 1,503 మందిని తొలగించిన నేపథ్యంలో బుధవారం ప్లాంటులో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు సమావేశమయ్యారు. యాజమాన్యం నిర్ణయంపై ఆందోళనకు సిద్ధం కావాలని నిర్ణయించారు. అయితే మరోసారి శుక్రవారం సాయంత్రం సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని కార్మిక నాయకులు తెలిపారు. అయితే ఎక్కువ మంది నాయకులు నిరవధిక సమ్మెకు వెళ్లాలని సమావేశంలో ప్రతిపాదించినట్టు తెలిసింది.

డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం

జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు అందజేసిన కూటమి కార్పొరేటర్లు


డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసానికి సంబంధించి నోటీసును కలెక్టర్‌కు అందజేస్తున్న కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు బుధవారం ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు ఇప్పటికే నోటీస్ ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 19న మేయర్ కౌన్సిల్ సమావేశం నిర్వహనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా డిప్యూటీ మేయర్లు ఇద్దరిపై అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ... మిగతా 6వ పేజీలో

శిథిల ఇళ్లల్లో భయం.. భయం

- వాంబే కాలనీలో దుస్థితి
- 25 ఏళ్ల నుంచి నిర్వహణ శూన్యం
- కూలిపోతున్న శ్లాబ్‌లు

మధురవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులోని మధురవాడ వాంబే కాలనీలో ఇళ్లు కనీస నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో నివాసితులు భయంతో కాలం వెల్లదీస్తున్నారు. ఈ కాలనీలో 120 బ్లాకుల్లో 3600 ఇళ్లను జీ ప్లస్ 3 తరహాలో 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించింది. నగరంలోని పలు మురికివాడల్లో నివసిస్తున్న వారిని ఇక్కడికి తరలించి వసతి కల్పించారు. ఇక్కడ ఉన్న వారంతా పేద,మధ్య తరగతి ప్రజలే. ఇళ్లు నిర్మించి, రెండు దశాబ్దాలు కావడం, నిర్వహణ లోపం వల్ల 120 బ్లాకుల్లో చాలావరకు మరమ్మతుకు గురయ్యాయి. ముఖ్యంగా శ్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. మెట్లు పూర్తిగా పాడయ్యాయి. బాల్కనీల్లో షేడ్‌లు కూడా పెచ్చులూడి పడుతున్నాయి. గోడల రంగు వెలసిపోయాయి. రెండేళ్ల కిందట ఒక బ్లాకులో మెట్ల మార్గం కూలిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రోజూ ఏదో ఒక చోట ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్లాబ్‌లకు పటుత్వం లేక సీలింగ్ ఫ్యాన్లు కిందకి జారి పడుతున్నాయి. మెట్ల మార్గంలో మూడో ఫ్లోర్‌కు చేరాలంటే గుండెలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని నివాసితులు చెబుతున్నారు. సాధారణంగా ఎవరైనా ఇళ్లు నిర్మించుకున్న నాలుగైదేళ్లకు మరమ్మతులు చేపడుతుంటారు. అలాంటిది ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఈ ఇళ్లను 25 ఏళ్లుగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షాకాలంలో మరింత భయం నెలకొంటోంది. కాలనీవాసులు ఇళ్లకు మరమ్మతులు చేయించాలని పదేళ్లుగా పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా.. ఎవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని ఇళ్లకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరతున్నారు.


రంగు వెలసిపోయిన గోడలు



మధురవాడలోని వాంబే కాలనీలో ఇళ్లు, పెచ్చులూడిన పోర్టుకో

నిత్యం భయపడుతున్నాం..



కొన్ని బ్లాకుల్లో మెట్ల మార్గాలు కూలే స్థితిలో ఉన్నాయి. గోడలు పెచ్చులూడి పాడవుతున్నాయి. మెట్ల మార్గంలో పిల్లలు నడుస్తుంటే ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని నిత్యం భయపడుతున్నాం.

- ఇమంది కొండమ్మ, కాలనీ నివాసి


స్వామివారి దర్శనానికి భక్తురాలిని డోలీలో తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

భైరవస్వామి దర్శనానికి భక్తుల పాట్లు

సింహాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అడవివరం గ్రామానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భైరవస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు పాట్లు తప్పడం లేదు. గతంలో ఈ ఆలయానికి వెళ్లడానికి సన్నటి కాలిబాటే మాత్రమే ఉండేది. ఏడేళ్ల క్రితం సింహాచలం దేవస్థానం ఈఓగా పని చేసిన భ్రమరాంబ సుమారు పది అడుగుల వెడల్పుతో మట్టి రోడ్డు నిర్మించారు.అప్పటి నుంచి కొందరు కాలినడకన, మరికొందరు ద్విచక్ర వాహనాల్లో ఆలయానికి చేరుకునేవారు. ఇటీవల దేవస్థానం అధికారులు, అటవీశాఖాధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల అటవీ శాఖ ఆలయానికి వెళ్లే మార్గంలోని మట్టి రోడ్డు ప్రారంభంలో గేటు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను నిలిపివేశారు.నాటి నుంచి భక్తులు కాలినడకనే స్వామివారి దర్శనానికి వెళ్తున్నారు. రాళ్లు తేలిపోయి అధ్వానంగా ఉన్న మార్గంలో రాకపోకలకు పలువురు ఇబ్బంది పడుతున్నారు. వికలాంగులు, వృద్ధులను కొందరు డోలీ మోతలో స్వామివారి దర్శనానికి తీసుకువస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రేమోన్మాది దాడి అమానుషం : ఎమ్మెల్యే గంటా

మధురవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్వయంకృషినగర్‌లో ప్రేమోన్మాది కత్తితో తల్లి, కూతురుపై చేసిన దాడి తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రేమ పేరుతో వేధించిన నిందితుడు నవీన్, నక్కా దీపికపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా అడ్డు వచ్చిన ఆమె తల్లి లక్ష్మిని హత్య చేయడం దారుణమన్నారు. దీపికకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాస్టర్ ప్లాన్ రహదారులపై అనుమానాలు

... 5వ పేజీ తరువాయి

వేశారు. ప్రస్తుతం ఆ సంస్థ వద్ద అన్ని నిధులు లేవు. గత వైసీపీ ప్రభుత్వం దాదాపు 80 శాతం నిధులు జగనన్న ఒక సెంటు ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి వాడేసుకుంది. దానికి ప్రత్యామ్నాయంగా భూములు ఇచ్చింది.వాటిని వేలం వేసి అమ్ముకోవాలని సలహా ఇచ్చింది. వీఎంఆర్‌డీఏ ప్రస్తుతం అదే పనిలో ఉంది. పాత లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లను వేలానికి పెట్టింది. ఇప్పుడు విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం అంత పెద్దగా లేదు. ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ వద్ద 300 గజాల ప్లాటు కొంటే కనీసం రూ. 40 లక్షలు పెట్టాల్సి ఉంటుంది. ఇంటి స్థలానికి అంత వెచ్చించినా వెంటనే ఇల్లు కట్టుకునే పరిస్థితి ఆ లేఅవుట్లలో లేదు. భూమిపై పెట్టుబడి పెట్టే వారికే అవి ఉపయోగపడతాయి.

భూములు కోల్పోయే వారి పరిస్థితి?

ఈ 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి సుమారు 75 ఎకరాలు ఆయా ప్రాంతాల్లో ప్రజల నుంచి తీసుకోవలసి ఉంటుంది. వారు ఎవరో ఇప్పటివరకూ గుర్తించలేదు. వారికి నష్ట పరిహారంగా డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. భూమికి భూమి ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు.దానికి ప్రభుత్వ ఆమోదం ఉండాలి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం టీడీఆర్‌లు ఇవ్వాలనేది అధికారుల ఆలోచన. కానీ వాటిని కూడా ఏళ్లు గడుస్తున్నా బాధితులకు ఇవ్వడం లేదు. సింహాచలంలో బీఆర్‌టీఎస్ రహదారికి సంబంధించి ఇదే విషయమై వివాదం నడిచింది. ఇవేవీ పట్టించుకోకుండా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

వీసీ..విభిన్నశైలి

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల తోనూ ఆయన మమేకమవుతున్నారు. తరగతులు జరుగుతున్న తీరు, బోధనలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారు. హాస్టళ్లలో భోజనం సరిగా లేదని చెప్పడంతో కొన్నింటిని ఆయన తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఒక్కో హాస్టల్ నుంచి భోజనం తెప్పించుకుని తింటున్నారు. కుటుంబ సభ్యులకు కూడా హాస్టల్ నుంచే భోజనం వెళుతోందని చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యత, రుచి వంటివి తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నది ఆయన భావన. అలాగే, గడిచిన కొద్దిరోజుల నుంచి సైన్స్ కాలేజీ పరిధిలోని మ్యాథ్స్ డిపార్టు మెంట్‌లో విద్యార్థులకు ఆయన పాఠాలు చెబు తున్నారు. వారంలో రెండు, మూడు క్లాసులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కొద్దిరోజుల్లో ఇంజ నీరింగ్ విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఆయన వెళ్లనున్నట్టు చెబుతున్నారు.

దూరంతో మేలు..

విభాగాల వారీగా తనిఖీలు ఉంటాయని, పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని గతం లోనే సూచించారు. దీంతో వీసీ ఎప్పుడు వస్తారో తెలియక అధికారులు విభాగాల్లోనే ఉంటున్నారు. ఆయన వచ్చే సమయానికి లేకపోతే ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో చాలామంది కనిపిస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా ఒక్కరే, అది కూడా సమాచారం లేకుండా వెళుతున్నారు.ఇది వర్సిటీలోని ఫ్యాకల్టీ, సిబ్బంది పనితీరును మెరుగుపర్చేందుకు దోహదం చేస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

స్వయం ఉపాధి రుణాలకు పోటెత్తిన దరఖాస్తులు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేషన్‌కు కేటాయించిన 50 యూనిట్లకు 59 మంది, కాపు కార్పొరేషన్‌కు కేటాయించిన 452 యూనిట్లకు 655 మంది, మేదర/కుమ్మరి/శాలివాహన కార్పొరేషన్‌కు కేటాయించిన 123 యూనిట్లకుగాను 193 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు వడపోస్తున్నారు. జోన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి రుణాలను మంజూరు చేయనున్నారు.

జనరిక్ మెడిసిన్ స్టోర్స్ ఏర్పాటుకు స్పందన నిల్

ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖలోని ఆయా కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటుచేయించాలని భావించింది. అయితే, జనరిక్ మెడికల్ స్టోర్స్ ఏర్పాటుకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. బీసీ కులాలకు చెందిన అభ్యర్థులకు జిల్లాలో 33 యూనిట్లు మంజూరుచేయగా 39 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఈబీసీ కులాలకు చెందిన యువత కోసం 36 యూనిట్లు మంజూరు చేయగా, ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అలాగే కమ్మ కార్పొరేషన్‌కు 14, రెడ్డి కార్పొరేషన్‌కు 40, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 50, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 17 యూనిట్లు మంజూరు చేయగా ఒక్క దరఖాస్తు అందలేదు. క్షత్రియ కార్పొరేషన్‌కు 21 యూనిట్లు మంజూరుకాగా, ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేశారు. మొత్తం జిల్లాకు ప్రభుత్వం 211 యూనిట్లు (జనరిక్ మెడిసిన్ స్టోర్లు) మంజూరు చేయగా, 40 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. యూనిట్ల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తులు రాకపోవడంతో ఏం చేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

దారుణం

.. 5వ పేజీ తరువాయి

వ్యవహరిస్తున్నా, బెదిరింపులు కొనసాగిస్తున్నా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం, ఇంకా తగ్గకపోతే షీట్ తెరిచి జైల్లోనే ఉండేలా చేయడం చేసేందుకు అవకాశం ఉండేది. కానీ బాధిత యువతితోపాటు ఆమె తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు విముఖత చూపారు. కుటుంబం పరువుపోతుందనో...నిందితుడి జీవితం నాశనమైపోతుందనో భావించి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనాసరే పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. దీనిని అలుసుగా తీసుకున్న నిందితుడు నవీన్ బుధవారం కత్తితో నేరుగా యువతి ఇంటికి వెళ్లాడు. తన పెళ్లికి నిరాకరించిన యువతి తల్లిని కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం యువతిపై కూడా కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పరారైపోయాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సీపీ శంఖబ్రతబాగ్చి కూడా బాధిత కుటుంబంతో మాట్లాడిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ నిందితుడు నవీన్ పలుమార్లు బాధితురాలితో అతిగా ప్రవర్తించడం, బెదిరించడం, బలవంతంగా శ్రీకాకుళం జిల్లాకు తీసుకువెళ్లడం వంటి చర్యలకు పాల్పడినప్పుడైనా పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. ఎవరైనా ప్రేమ పేరుతో వెంటపడినా, పెళ్లి చేసుకోవాలని బలవంతం చేసినా, తాము చెప్పినట్టు వినకపోతే ప్రాణం తీస్తామని, దాడులు చేస్తామని, కుటుంబ సభ్యుల అంతుచూస్తామని బెదిరిస్తే వెంటనే కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలని సీపీ విజ్ఞప్తిచేశారు. తల్లిదండ్రులు తమకు ఎదురైనా ఇబ్బందిని లేదా భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించినప్పుడు డయల్ 100కి లేదంటే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే ఆకతాయిలు, దురుసుగా ప్రవర్తించే జులాయిల ఆటకట్టించేందుకు, తద్వారా బాలికలు, యువతులకు రక్షణ కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. బాధితులు కోరితే వారి వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరంగా రక్షణ కల్పిస్తామని సీపీ భరోసా ఇచ్చారు.

అప్పన్నకు గరుడ సేవ


గరుడ వాహనంపై స్వామివారు

సింహాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం గరుడ సేవ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సకల ఆభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి రజిత ఆసనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం గరుడ సేవ చేశారు. భక్తులు గరుడ వాహనంపై ఉన్న స్వామివారి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. అంతకముందు అర్చకులు స్వామివారికి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

లాజిస్టిక్ రంగంలో అపార అవకాశాలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ ఆపరేషన్ అన్న అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంస్థ అవాన్ ఇంటలెక్ట్ అధ్యక్షుడు డేవిడ్ సింగ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ఇండియా) బబ్లూ తివారి, ప్రొఫెసర్ కార్తికేషన్ మాట్లాడుతూ లాజిస్టిక్స్, ఆపరేషన్ రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పణిపప్పు మాట్లాడుతూ పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య బలమైన సంబంధాల ద్వారా దేశానికి అవసరమైన మానవ వనరులను సిద్ధం చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. సాయి సుధాకర్, ఆపరేషన్, సప్లై విభాగం చైర్మన్ డాక్టర్ వైఎల్‌పీ తోరణి, తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

తగరపువలస, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంగ్లామెట్ట పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆటిజం, నడక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు మాట్లాడుతూ పిల్లల్లో వయస్సుకు తగినట్టుగా మానసిక ఎదుగుదల లేకపోవడాన్ని ఆటిజం అంటారని, బాల్యంలో పిల్లలకు వచ్చే ఈ వ్యాధిపై ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. నడక కూడా ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులక పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

భీమునిపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పాలీసెట్ రాసే విద్యార్థులకు ఈనెల 3 నుంచి 28 వరకు పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిక్షణ ఉంటుందని, దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

8వ వార్డులో రక్తదాన శిబిరం

ఎండాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ దసపల్లా లేఅవుట్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఆ వార్డు పార్టీ అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ జన్మదినం పురస్కరించుకుని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసైనికులు, వీర మహిళలు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడు, నాలుగు వార్డుల్లో రూ. 3.62 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న కుమారి, కార్పొరేటర్లు చిన్నికుమారి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

మధురవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మధురవాడలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలన సాగిస్తుందని విమర్శించారు.మతపరమైన అంశాలు ఉపయోగించి, మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేసేలా మోదీ పాలన ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మహా సభల్లో ఈ అంశాల అన్నింటిపైనా చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొల్లి మేఘారావు, వాండ్రాసి సత్యనారాయణ, బి. కేశవయ్య, వేళంగినిరావు, తదితరులు పాల్గొన్నారు.

సంతలో ఆశీలు వసూలుకు వేలం

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ప్రతి బుధవారం జరిగే సంతలో ఆశీలు వసూలుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓఆర్‌డీ మీనాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో నలుగురు పాల్గొనగా హెచ్చు పాటదారుగా ఉన్న కంటుబోతు శ్రీనుకు రూ. 1.25 లక్షలకు పాటను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు


అయినాడలో స్థానికులతో మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాసరావు

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి పంచాయతీ కార్యదర్శులు, పాలక వర్గాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి. శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఆయన అయినాడ, బీఆర్ తాళ్లవలస, సామయ్యవలస గ్రామాల్లో జరిగిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రతి వీధిని సందర్శించి, హరిత రాయబారులు చెత్త సేకరణకు వస్తున్నది లేనిది ఆరా తీశారు. గ్రామ పంచాయతీలు కాలువలను శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం వంటి పనులు చేస్తున్నది లేనిది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుధ్యం మెరుగుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు చేరవేసేలా చూడాలన్నారు.

8న పద్మనాభం మండల సమావేశం

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయకుమార్ చెప్పారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ కె. రాంబాబు అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలన్నారు.

అప్పన్న పెళ్లికి.. రథసారథికి ఆహ్వానం


లక్ష్మణరావుకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఏఈఓ ఆనందకుమార్

సింహాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 8న జరగనున్న వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవానికి ఆడపెళ్లి వారి తరఫున మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అప్పన్న రథసారథి కదిరి లక్ష్మణరావును దేవస్థానం ఏఈఓ ఎన్. ఆనందకుమార్ ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం ఆయన లక్ష్మణరావు నివాసానికి వెళ్లి శాలువతో సత్కరించి, దేవస్థానం తరపున అధికారిక లేఖను, ఆహ్వాన పత్రికను, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. యథా ప్రకారం స్వామివారి కల్యాణోత్సవంలో తమ పరివారంతో పాల్గొని, రథానికి సారధ్యం వహించి, ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.


మరమ్మతులు పనులు జరుగుతున్న జెడ్పీ అతిథి గృహం

జెడ్పీ గెస్ట్ హౌస్‌కు శరవేగంగా మరమ్మతులు

పద్మనాభం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని రూ. 5 లక్షలతో మరమ్మతు చేస్తున్నారు. ఈ అతిథి గృహానికి కొంతకాలంగా ఎటువంటి నిర్వహణ చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఉపయోగంలో కూడా లేకుండాపోయింది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతులు చేపడుతున్నారు. శ్లాబ్ లీకేజీ నివారణ పనులతో పాటు గదుల్లో వసతులు కల్పించనున్నారు.ఈ పనులు పూర్తయితే మండల కేంద్రానికి ప్రముఖులు వచ్చినప్పుడు కొంతసేపు విశ్రమించడానికి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడానికి సౌకర్యవంతంగా ఉంటుంది.


ఏతపేటలో నినాదాలు చేస్తున్న టీడీపీ, సీపీఎం నాయకులు

సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని నిరసన

తగరపువలస, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్‌కు ఆనుకుని ఉన్న ఏతపేట వద్ద సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులతో కలిసి టీడీపీ, సీపీఎం నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టవర్ ఏర్పాటు వల్ల రేడియేషన్ పెరిగి చుట్టు పక్కల నివాసితులు అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. తక్షణమే టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, మూర్తి, అప్పలనాయుడు, సూర్యనారాయణ, రీసు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

... 5వ పేజీ తరువాయి

చెప్పాడు. సీఐ చింతా వాసునాయుడు కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని సివిల్ సప్లైస్ టీడీ కె.శ్రీనివాసరావుకు అప్పగించారు. అలాగే టూటౌన్ ఎస్‌ఐ డి.రాము ఆధ్వర్యంలో పోలీసులు గొల్లలపాలెం జంక్షన్ వద్ద బొలేరో వాహనంలో తరలిస్తున్న 50 కిలోల బరువు గల 80 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఈ బియ్యాన్ని పద్మనాభంలోని ఓ వ్యక్తికి అప్పగించేందుకు తరలిస్తున్నట్టు విచారణలో నిందితులు వెల్లడించారని పోలీసులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో వాహనాన్ని పౌర సరఫరాల విభాగానికి అప్పగించామన్నారు.

డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

ఇవ్వడంతో 19న జరిగే కౌన్సిల్ సమావేశంలోనే ఈ అంశం కూడా తేలిపోయే అవకాశం ఉందంటున్నారు. నోటీస్ అందజేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే జీవీఎంసీలో కూడా కూటమి పాలన ఉండాలని నగరవాసులు కోరుకుంటున్నారన్నారు. అందుకోసమే మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చామన్నారు. జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని, అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతోపాటు టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వడ్లపూడి జంక్షన్.. యమ డేంజర్

» ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని సిగ్నల్ వ్యవస్థ
» నిత్యం గజిబిజిగా ట్రాఫిక్ » తరచూ రోడ్డు ప్రమాదాలు



సిగ్నల్ లైట్లు పనిచేయక వడ్లపూడి జంక్షన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి జంక్షన్ మృత్యు కూడలిగా మారిందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ కూడలిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించిన ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు సిగ్నల్ లైట్లకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు జడ్సీ బీఆర్ఎస్ శేషాద్రికి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కనిపించడం లేదు. ఆ బాధ్యత మాది కాదంటే.. మాది కాదంటూ కాలయాపన చేస్తున్నారు. కానీ సమస్య పరిష్కారానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

గాజువాక పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులతో నిత్యం ఈ జంక్షన్‌ను రద్దీగా ఉంటుంది. అలాంటి జంక్షన్‌లో ఏళ్లతరబడి సిగ్నల్ లైట్లు పనిచేయకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ జంక్షన్‌లో రోడ్డు దాటాలంటే అరచేతిలో ప్రాణాలను పెట్టుకోవాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. ప్రతిరోజూ ఈ మార్గం గుండా స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, వీఎస్ఈజడ్, ఏపీఐఐసీ, దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వందలాదిమంది కార్మికులు, ప్రయాణికులు, విద్యార్థులు, రాకపోకలు సాగిస్తుంటారు. ఈ జంక్షన్‌కు సమీపంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పలు కళాశాలలు, పాఠశాలలు ఆలయాలు, వంటివి కూడా ఉన్నాయి. ఇంత ముఖ్యమైన కూడలిలో సిగ్నల్ లైట్లు వేసేందుకు అధికారులు చొరవ చూపి రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు వాహనదారులతో పాటు స్థానికులు కోరుతున్నారు. గతంలో ఈ కూడలిని ట్రాఫిక్ ఏసీపీ స్వయంగా పరిశీలించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

-మాటూరి రాము, వడ్లపూడి



గాజువాక వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో నిత్యమూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. నాలుగు మార్గాల కలయికతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీనికితోడు సిగ్నల్‌లైట్లు పని చేయడం లేదు. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు, మందుబాబుల ఆగడాలు, రోడ్డు ఆక్రమణలతో సమస్య మరింత జటిలమవుతోంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు

సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన

అగనంపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవం కోసం గర్భిణులు సరైన పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు వ్యాయామం, విశ్రాంతి తీసుకోవాలని, వైద్యుల సూచనలను పాటించాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి పేర్కొన్నారు. సిజేరియన్ వద్దు-సాధారణ ప్రసవాలు ముద్దు అనే అంశంపై బుధవారం గర్భిణులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. గర్భిణులకు ప్రతిరోజూ 7 నుంచి 8 గంటల నిద్ర అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉష, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ అనుపోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి పరిసర ప్రాంతాల ప్రజలు ఆరాధ్య దేవత దుర్గమాంబ అనుపోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే పూజాది కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, హోమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్ఎస్ విజయ రామరాజు, పి.వేణుబాబు, ఎం.దామోదర్, శంకరరావు, దానప్పలు, బి.గోవిందరాజులు, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'మన చెత్త మన బాధ్యత'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మన చెత్త మన బాధ్యత అని, తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు పర్యవేక్షణలో బుధవారం 87వ వార్డు తిరుమలనగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావులు మాట్లాడుతూ అందరూ పాలిథీన్ కవర్లను నిషేధించాలని, కాలుష్య నివారణకు ఇంటికొక మొక్కను నాటాలని, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతినిధులు పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీలీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా**: శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 60, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256



తీపి గురుతుగా గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం

పెదగంట్యాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీ రోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వారంతా కలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఉద్యోగ విరమణ చేసినవారు, వ్యాపారాలు, ఇతర రంగాల్లో స్థిరపడిన వారంతా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుంటూ, పిల్లల పెళ్లిళ్లు, తదితర అంశాలపై ముచ్చట్లాడుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గానాల బ్రహ్మం, ఉడా వెంకట శ్రీనివాసరావు, బోయి పేరిరెడ్డి, వై.ఈశ్వరరావు, జీలకర్ర రమణ, కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్ర ఫౌండేషన్ సహకారంతో 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు గల డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెల్త్ కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు ఎంపికైన విద్యార్థులకు కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చి సెంటర్, షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి క్యాంపస్‌లో 3 నెలల పాటు ఉచిత శిక్షణనిచ్చాక ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7207953919 సెల్ నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

7న ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, కార్మిక సమస్యలపై ఈ నెల 7వ తేదీన రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరగనున్నాయి. గత నెలలో మూడుసార్లు చర్చలు జరిగినా విఫలమవ్వడంతో వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంట్రాక్టు కార్మికులు ఒకరోజు సమ్మె కూడా చేశారు. చర్చలు వాయిదా పడినప్పటికీ కార్మికుల తొలగింపుపై ఉక్కు యాజమాన్యం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ క్రమంలో 7వ తేదీన జరగనున్న చర్చలు కీలకంగా మారనున్నాయి. ఈ చర్చల తరువాత కార్మికుల భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని కార్మిక నాయకులు తెలిపారు.

స్టీల్ క్లబ్‌లో స్విమ్మింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారులందరూ చదువుతో పాటు అన్ని అంశాలలోనూ ప్రావీణ్యం సంపాదించాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్, స్టీల్ క్లబ్ అధ్యక్షుడు ఎం.మధుసూధనరావు అన్నారు. స్టీల్ క్లబ్‌లో బుధవారం స్విమ్మింగ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆహ్లాదం కోసం స్టీల్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, నరసింహం, రమణ, వెంకటరాజు, సాయి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణపై నేడు గ్రామ సభ

గాజువాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై గురువారం గ్రామసభ నిర్వహించనున్నట్టు తహశీల్దార్ శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొత్త గాజువాక జంక్షన్‌లో బహిరంగ సభ ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు హాజరవుతారన్నారు. ఈ సభలో జీవోకు సంబంధించి విధి విధానాలు, తదుపరి కార్యాచరణను వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలందరూ సభకు హాజరు కావాల్సిందిగా తహశీల్దార్ శ్రీవల్లి కోరారు.

చెరువులు, గెడ్డల్లో ఈతతో ప్రమాదం

పిల్లలపై దృష్టి పెట్టాలంటున్న పోలీసులు



కొత్తపాలెం శివారు గెడ్డలో ఈదుతున్న చిన్నారులు (ఫైల్)

గోపాలపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే ఎండ తాపానికి తట్టుకోలేక చాలా మంది ఈతకు వెళ్తుంటారు. ముఖ్యంగా నగర పరిధి 88, 89 వార్డుల్లోని కొత్తపాలెం, నరవ ప్రాంతాల్లో ఉన్న గెడ్డల్లో ఈతగాళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పూర్తిగా ఈత వచ్చిన వారితో ప్రమాదం లేకున్నా, ఈత నేర్చుకోవడానికి, వేసవి తాపాన్ని ఓర్వలేక సేద తీరడానికి ఈ గెడ్డలకు వస్తున్న వారిలో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. వీరిలో ముఖ్యంగా పదేళ్ల నుంచి ఇరవై ఏళ్ల వయసున్న బాలురు, యువకులే ఎక్కువ. వీరిలో చాలా మందికి ఈత రాకపోయినా గెడ్డలు పెద్దగా లోతు ఉండవనే భావనతో ఈతకు దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తపాలెం శివారు గెడ్డలతో పాటు ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద ఉన్న ఎంజీఆర్ గెడ్డల్లో ఈతరాని వారే ఎక్కువగా దిగుతున్నారు. వేసవిలో పాఠశాలలు సెలవులతో తోటి యువకులు, బాలురుతో కలిసి మధ్యాహ్నం సమయంలో వీరు గెడ్డల్లో స్నానాలకు దిగుతున్నారు. ఈ ప్రాంతాల్లోని గెడ్డల్లో ఊబితో పాటు ఇసుక తవ్వకాల వలన పెద్ద గోతులు ఏర్పడాయి. ఈ విషయం తెలియని వారు ఈతకు దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గోపాలపట్నం, కొత్తపాలెం, యల్లపువానిపాలెం, వెంకటాపురం, కంపరపాలెం, బాజీజంక్షన్ ప్రాంతాలకు చెందిన వారే ఇక్కడ గెడ్డలో ఈతకు వస్తుంటారు. ఏటా వేసవిలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరగాలని, గెడ్డల్లో స్నానాలకు వెళ్లకుండా నిరోధించాలని పోలీసులు సూచిస్తున్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం'



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సీపీఎం మహాసభల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల బుధవారం పార్టీ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న సీపీఎం జాతీయ మహాసభలను పురస్కరించుకొని పారిశ్రామిక ప్రాంతం 59, 61, 63 వార్డులలో పార్టీ జెండాలను ఆవిష్కరించామన్నారు. ప్రజాపక్షానే సీపీఎం నిలబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణమూర్తి, ఉరుకూటి బాబూరావు, ఎస్.శ్రీను, ఆర్.విమల, ఉమ, గంగాధర్, గణేష్, సురేష్, మహేంద్ర పాల్గొన్నారు.

హామీలను గాలికి వదిలేస్తున్న ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఎన్నికల హామీలను గాలికొదిలేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ విమర్శించారు. శ్రీహరిపురంలో బుధవారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు టిడ్కో ఇళ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. పార్టీ శతవార్షికోత్సవం సందర్భంగా బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈనెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగసభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గుడాల రాంబాబు, గండి అప్పారావు, అప్పలరెడ్డి, చంద్రశేఖర్, ప్రకాశ్, సత్యవతి, శ్రీలక్ష్మి, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

షిప్‌యార్డు మాజీ సొసైటీ ఉద్యోగుల్లో ఆందోళన

మల్కాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు మాజీ సొసైటీ ఉద్యోగుల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 30 ఏళ్ల క్రితం షిప్ యార్డులో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగుల పిల్లలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో నాటి సీఎండీ శరత్‌చంద్ర ఉత్తర్వులు మేరకు సొసైటీని ఏర్పాటు చేశారు. అప్పట్లో రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలతో పాటు బయటవారిని కూడా యూనియన్ నాయకులు చేర్పించారు. ఈ విషయాన్ని కొందరు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లగా అందరూ సొసైటీలో ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. అప్పటినుంచి ఇప్పటివరకు సొసైటీలో అందరూ కొనసాగుతూ వస్తున్నారు. ఇటీవల షిప్‌యార్డు యాజమాన్యం మళ్లీ సొసైటీ నియామకాలపై దృష్టిపెట్టి, బయటవారు ఉన్నట్టు తెలుసుకుని వారిని తొలగించే చర్యలు చేపట్టింది. దీంతో అందరిలోనూ గుబులు పట్టుకుంది.

'విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం'

ఎన్ఏడీ జంక్షన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు ఏడీఈ రాము నాయుడు బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కొండవాలు ప్రాంతాల్లో వేసవిలో లోఓల్టేజి సమస్య అధికంగా ఉండడంతో స్థానికులు విషయాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు ఏడీఈ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

6న సీతారాముల కల్యాణం

అగనంపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న శ్రీరామనవమిని పురస్కరించుకుని 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం రామాలయం వద్ద ఉడుపురాట ఉత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసి ఉడుపురాట వేశారు. 6న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

జాతీయ రహదారిపై ఒకచోట వెలుగు... మరోచోట అంధకారం

» ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



సరిపల్లి బ్రిడ్జి సమీపంలో నెలకొన్న అంధకారం



అక్కడికి కొద్ది దూరంలో వెలుగుతున్న లైట్లు

పెందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-ఆనందపురం నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహన చోదకులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. రహదారిపై మిరుమిట్లు గొలిపే దీపాలు...అంతలోనే అంధకారంతో విస్మయపరుస్తోంది. అత్యంత రద్దీగా ఉండే ఆరులైన్ల రహదారి సరిపల్లి ఆర్వోబీ నుంచి వాహనాలు యూటర్న్ తీసుకుని గుర్రమ్మపాలెం మీదుగా వెళ్లే మార్గంలో దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. హైవే నుంచి ప్రయాణించి, సమీప గ్రామాలకు చెందిన వాహనచోదకులు టన్నల్స్‌లో ప్రయాణించి పెందుర్తి వైపు రావాలి. ఈ క్రమంలో సుమారు కిలోమీటరు మేర దీపాలు వెలగకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. హైవేపై ఇటీవల దొంగతనాలు చోటుచేసుకోవడంతో వాహన చోదకులు భీతిల్లుతున్నారు. కాగా ఇదే రహదారిలో మరోచోట దీపాలు వెలుగుతున్నాయి.



సభ్యత్వ కార్డులను చూపుతున్న ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు

కార్యకర్తలకు అండగా టీడీపీ

గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాకలో సుమారు 75 వేల మందికి సభ్యత్వ నమోదు కార్డులను అందజేయనున్నామన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారిని ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సాకే రతన్‌కాంత్, నమ్మి అప్పారావు, నరేశ్, దేవి, పుష్ప, జ్యోతి, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్వీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నెల 4వ తదీ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ అడబాల పార్థసారథి, ఏఈ రామకృష్ణలు తెలిపారు. ఈ కారణంగా ఎర్రగెడ్డ కాలనీ, శ్రీనివాసనగర్, శ్రామిక నగర్, కుంచుమాంబ కాలనీ, చినగంట్యాడ, చైతన్యనగర్, దత్తసాయి నగర్, తహశీల్దార్, జోనల్ కార్యాలయం, కోర్టు, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

పెందుర్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సీ బీసీ కాలనీ, ద్రోణంరాజునగర్, అశోక్‌నగర్, సాయినగర్, సత్యానగర్, పాతఊరు, చిన్నయ్యకాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

సెల్ టవర్ వద్దంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

అగనంపూడి. ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి శాంతినగర్‌లో సెల్ టవర్ ఏర్పాటుపై స్థానికులు బుధవారం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. జనవాసాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తే తరంగాల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల తక్షణమే అనుమతులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో స్థానికులు మొదలవలస గోవిందరావు, బి.సత్యనారాయణ, చిత్రా నాగమణి, డి.మహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

పెదగంట్యాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పారిశ్రామికవాడ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. గాజువాక వర్తక సంఘం, పెదగంట్యాడ పారిశ్రామికవాడ వర్కర్స్ యూనియన్ పూర్వపు అధ్యక్షుడు తిప్పల చిన అప్పారావు వర్ధంతి సందర్భంగా యూనియన్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డిలు మహిళలు చీరలు అందజేశారు. కార్యక్రమంలో పెదగంట్యాడ ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పల నితీశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గొందేశి పెదరెడ్డి, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో భాగంగా విన్యాసాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఘనంగా ఆళ్వార్స్ స్కూల్ స్పోర్ట్స్ డే

వేపగుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం పెట్రోల్ బంకు దరి ఆళ్వార్స్ స్కూల్లో బుధవారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జీఎస్టీ కమిషనర్ పి. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రారంభించిన ఖేల్ భారత్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఆటల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం ఏడాదికి రూ. 5 లక్షలు చొప్పున ఎనిమిదేళ్లు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ డైరెక్టర్ హర్షలత చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటల ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పేరేడ్, జాతీయ పతాకం పట్టుకొని చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హేమచంద్రరావు, క్యాంపస్ కోఆర్డినేటర్ జీవీఏఎస్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాది దాడి అమానుషం : ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్వయంకృషినగర్‌లో ప్రేమోన్మాది కత్తితో తల్లి, కూతురుపై చేసిన దాడి తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రేమ పేరుతో వేధించిన నిందితుడు నవీన్, నక్కా దీపికపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా అడ్డు వచ్చిన ఆమె తల్లి లక్ష్మీని హత్య చేయడం దారుణమన్నారు. దీపికకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టీటీసీ వేసవి కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ వేసవి శిక్షణా కోర్సునకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మే నెల 1 నుంచి జూన్ నెల 11వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 25 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుడు మే నెల 1నాటికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు.

ఇవీ అర్హతలు :

» పదో తరగతి ఉత్తీర్ణులై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులో లోయర్ పూర్తి చేసి ఉండాలి.
» ఎస్సెస్సీ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.
» బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ ఏపీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి
» స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ అండ్ ట్రైనింగ్ (ఎస్బీటీఈటీ), ఏపీ జారీ చేసిన సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» ఇండస్ట్రీస్ - కామర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ హ్యాండ్లూమ్ వీవింగ్ వారు జారీ చేసిన ఉత్తీరత సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» తెలుగు విశ్వవిద్యాలయం జారీ చేసిన కర్నాటక మ్యూజిక్ (వోకల్ లేదా వీణ లేదా వయోలిన్) లలో డిప్లొమో సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ కలిగిఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలో వెబ్‌సైటు www.bse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని కోర్సు కేంద్రం ఏ జిల్లాలో ఎంపిక చేసుకొంటే ఆ జిల్లాకు సంబందించిన జిల్లా విద్యాశాకాధికారి వారి కార్యాలయం లో అప్లికేషన్ ప్రింట్‌తో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువ పత్రాలు జత చేయాలన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచితరగతులకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ తెలిపారు.

17న ముత్యాలమ్మ పండగ



ముత్యమాంబ అమ్మవారి ఆలయం

కంచరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గవర కంచరపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగను ఏప్రిల్ 17న నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకోసం కంచరపాలెం మెట్టు వద్ద గల అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. నూతనంగా రంగులు వేస్తున్నారు. 16న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 17న ప్రధాన పండగ నిర్వహిస్తారు. గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా ఏటా ముత్యమాంబ పండగను ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఉత్సవాలను శోభాయమానంగా చేపట్టడానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమ్మవారి పండగపై గ్రామంలో ఇప్పటికే చాటింపు నిర్వహించారు.

పేతురు దేవాలయ మార్గంలో పరిశుభ్రత చర్యలు



జ్ఞానాపురంలో రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

జ్ఞానాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం పునీతపేతురు దేవాలయం వద్ద గురువారం జరగనున్న ఆర్చ్ బిషప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా సూచన తో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది జ్ఞానాపురం నుంచి దేవాలయానికి వెళ్లే అన్ని రహదారులను శుభ్రపరిచారు. ఎక్కడికక్కడ చెత్తను తొలగించారు. అలాగే విద్యుత్ సిబ్బంది వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. పనులను వార్డు సీనియర్ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, వేలంగిణిరావు తదితరులు పర్యవేక్షించారు.

24న మినీ బాలోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ సునీత తదితరులు

మహారాణిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి విజ్ఞానకేంద్రంలో బుధవారం మినీ బాలోత్సవం పోస్టర్‌ను ఆసరా చైర్‌పర్సన్ సి.సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసరా చారిటబుల్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్‌క్లబ్‌తో సంయుక్తంగా ఈ నెల 24న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీబాలోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత మూడేళ్లలో వీసీసీ ద్వారా ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ సబ్ జూనియర్లు ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి, జూనియర్లు 3 నుంచి 5వ తరగతి, సీనియర్లు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు (ఈవెంట్స్) నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరా సభ్యులు శ్రీనాథ్, సుధ, సతీష్, కల్యాణి, భవాని, అనురాధ, మణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తిలో కార్డన్ సెర్చ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నాలుగో పట్టణ సీఐ తన ఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి దొండపర్తి ప్రాంతంలో ఒక్కసారిగా తనిఖీలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులంతా ఏం జరిగిందో, ఏమో, అని ఆందోళన చెందారు. అనుమానిత వాహనాలు ఉంటే స్వాధీనం చేసుకుంటామని, అనుమానితులు ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు లేని 18 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కి తరలించారు.

'పీ-4లో బీసీల రిజర్వేషన్ అమలు చేయాలి'

మాధవధార, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పి-4 విధానంలో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ అమలు చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష మేరకు పేదరికం తగ్గాలంటే అనవసర నిబంధనల నుంచి స్వేచ్ఛ ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కులవృత్తులను ప్రోత్సహించడం ద్వారా సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచవచ్చని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి పి-3లో బీసీలకు, అణగారిన వర్గాలకు రిజర్వేషన్ అమలు చేసి ఎంతో మేలు చేకూర్చిన విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు పరిశీలించాలని అన్నారు.

తపాలా పేరు స్థిరం.. సేవలు దూరం!



జ్ఞానాపురంలో గతంలో ఉండే తపాలా కార్యాలయం

జ్ఞానాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఎంత పెరిగినా, మొబైల్ ఫోన్లు, వాట్సప్‌లు, ఇతరత్రా ఆధునిక సమాచార వ్యవస్థ అందుబాటులో ఉన్నా, ఇంకా చాలా మంది తపాలా (పోస్టాఫీసు) సేవలను వినియోగిస్తున్నారు. అలాంటి సేవలను జ్ఞానాపురం వాసులకు అధికారులు దూరం చేశారు. ఇప్పుడు పోస్టాఫీసు వీధి పేరు మాత్రమే ఇక్కడ మిగిలింది. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయం వెనుక ఎన్నో ఏళ్ల క్రితం పోస్టాఫీసును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తపాలా సేవలను ప్రజలకు అందించారు.కానీ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఈ కార్యాలయాన్ని ఇక్కడ తొలగించారు. అప్పటి నుంచి ప్రజలు ఏ సేవలు కావాలన్నా మూడు కిలోమీటర్ల దూరంలోని రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న వాల్తేరు ఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ఉపాధి, బీమా పథకాలను తపాలా కార్యాలయాల ద్వారా అందిస్తుండడంతో అనేక మంది పోస్టాఫీసులను ఆశ్రయిస్తున్నారు. ఇదే విధంగా నగరంలోని మురళీనగర్ ప్రాంతంలో పోస్టాఫీసు సేవలను నిలిపివేయడంతో స్థానికులు ఎమ్మెల్యే సహకారంతో మళ్లీ పునరుద్ధరించుకోగలిగారు. ధనికులు ఎక్కువగా ఉండే అలాంటి ప్రాంతంలోనే తపాలా కార్యాలయాన్ని పునరుద్ధరిస్తే, మురికివాడలు ఎక్కువగా ఉండే జ్ఞానాపురం లాంటి ప్రాంతంలో మాత్రం నాయకులు పేదల అవస్థలు పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి జ్ఞానాపురంలో తపాలా సేవలు పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు



సామాజిక భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

కంచరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. జీవీఎంసీ 48వవార్డు పరిధి ఇందిరానగర్-4 గ్రామంలో కొత్తగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ గ్రామంలో రూ.50 లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్పొరేటర్ గంకల కవిత మాట్లాడుతూ ఇతర గ్రామాల్లో ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, స్థానిక కూటమి నాయకులు గంకల అప్పారావు, గొర్లె అప్పారావు, గునుపూడి అరుణ్, సత్యాడ అప్పారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోరిన వైసీపీ కార్పొరేటర్లు ఎక్కడ ఉన్నారు?: మూర్తియాదవ్

సీతంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రక్షణ కోరిన వైసీపీ కార్పొరేటర్లు ఎక్కడ ఉన్నారో తెలపాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ కూటమివి క్యాంప్ రాజకీయాలు అనడం ఏమిటి? క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టిందే మీరన్నారు. అక్కడ ఉన్నవారికి రక్షణ లేదని అంటే మీ నుంచి ప్రాణహాని ఉందా? అని ప్రశ్నించారు. బడ్జెట్ మీటింగ్‌కు కూడా రాకుండా కార్పొరేటర్లు ఏమైపోయారో పోలీసులు విచారణ చేయాలన్నారు. కూటమి పార్టీలపై బురద జల్లడం మానుకోవాలన్నారు. 19న సాయంత్రం అన్ని లెక్కలు తేలుతాయని, అందరి చిట్టాలు బయట పడతాయన్నారు. బెంగళూరు లోటస్ పాండ్‌లో కార్పొరేటర్లను పెట్టి కాపలాకు ఆంధ్రా పోలీసులు కావాలని అడగడం సిగ్గు చేటన్నారు.

మూడేళ్లలోపే పిల్లలకు ఆటిజం లక్షణాలు



ఓ తల్లికి సూచనలు చేస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని (26వ వార్డు) జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినం సందర్భంగా ప్రత్యేకావసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులకు బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణి పలు సూచనలు చేశారు. వయస్సుకు తగ్గట్టు పిల్లల్లో మానసిక ఎదుగుదల రాకపోవడాన్ని ఆటిజం అంటారని చెప్పారు. బాల్యంలో ప్రారంభమయ్యే అరుదైన సమస్యగా పేర్కొన్నారు. ప్రతి వందమందిలో ఒకరు లేదా ఇద్దరు చిన్నారుల్లో ఈ సమస్య కనిపిస్తోందని చెప్పారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస మాట్లాడుతూ 2023 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 70 కోట్ల మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. ఇది పెద్ద ప్రమాదం కాకపోయినా దీన్ని నివారించడంలోనే అనేక సవాళ్లు ఎదుర్కొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆటిజం లక్షణాలు మూడేళ్ల వయస్సు నిండక ముందే కనిపిస్తాయని, దీనికి లింగ భేదం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, భవిత కేంద్రం ఉపాధ్యాయినులు శారద, జగదాంబ పాల్గొన్నారు. గ్రేటర్ 43వ వార్డు జగన్నాథపురంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో జరిగిన వేరొక కార్యక్రమంలో యూఎస్ నేవీ అధికారులు వచ్చి ప్రత్యేకావసరాలు గల పిల్లలతో కలిసి చేతి పనులను రూపొందించారు. తమ సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించడానికి యూఎస్ నేవీ అధికారులతో తమ అనుభవాన్ని పంచుకునే అవకాశం పొందారు. కుందన్ గాజులు, హ్యాంగింగ్‌లు, అలంకార వస్తువులను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన



టిక్కెట్ ఎలా తీసుకోవాలో ప్రయాణికునికి అవగాహన కల్పిస్తున్న రైల్వే కమర్షియల్ సిబ్బం

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ టికెట్ బుకింగ్ వినియోగంపై వాల్తేరు రైల్వే ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా యూటీఎస్ మొబైల్ యాప్‌పై బుధవారం అవగాహన డ్రైవ్ నిర్వహించింది. అన్ రిజర్వుడు టికెట్‌ను బుక్ చేసుకోవడానికి యూటీఎస్ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి? చెల్లింపు ఎలా చేయాలి? టికెట్ ఎలా పొందాలి? అనే అంశాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. యూటీఎస్ యాప్ ద్వారా అన్ రిజర్వుడు టికెట్ బుక్ చేసుకునేవారికి ఆగస్టు 24 వరకు ఆర్-వాలెట్ రీచార్జిలపై రైల్వే మంత్రిత్వ శాఖ మూడు శాతం బోనస్‌ను అందిస్తోందని, ఆర్-వాలెట్‌లో జమ అయిన సొమ్మును తర్వాత కాలంలో టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలో ఉపయోగించుకోవచ్చునని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

దమన్‌జోడి మార్గంలో డీఆర్ఎం తనిఖీలు



నాల్కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో డీఆర్ఎం లలిత్ బొహ్రా చర్చలు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దమన్‌జోడి, రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం పర్యటించారు. విండో ట్రైలింగ్ ద్వారా స్టేషన్లలోని మౌలిక సదుపాయాలు, భద్రత వంటి కీలక అంశాలను, డబ్లింగ్ నిర్మాణం, అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించారు. అక్కడ నుంచి దమన్‌జోడిలోని పంచపత్మలి బాక్సైట్ గనుల వద్ద పర్యటించి అక్కడి నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో సమావేశమై భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలు, లోడింగ్ కార్యకలాపాలు, క్రమబద్ధీకరణ వంటి పలు అంశాలపై చర్చించారని సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

'ప్రవాస భారతీయుల సాహితీ సృజన అద్భుతం'



పౌరగ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గండికోట రఘురామారావు ఇతర సాహితీ ప్రముఖులు

సీతంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ సంస్కృతి మాస పత్రిక ఆధ్వర్యంలో రచయిత డాక్టర్ రమేష్ ప్రసాద్ రావెళ్ల (యుఎస్ఏ) రాసిన విమర్శనా వ్యాస సంపుటి ప్రవాస సాహిత్య పుస్తకాన్ని బుధవారం రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు ఆవిష్కరించారు. సంస్కృతి ఎడిటర్ శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవాస భారతీయ రచయితల సాహితీ సృజనపై రమేష్ ప్రసాద్ రావెళ్ల విమర్శనాత్మక వ్యాసాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ కేవీఎస్ మూర్తి సమీక్ష చేశారు. డాక్టర్ హరిబాబు తమ్మినేని, మేడా మస్తాన్ రెడ్డి, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వాహనాల తొలగింపునకు హామీ



అధికారులతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ నర్సకుమారి

మర్రిపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలించే క్లాప్ వాహనాలను స్థానిక శ్మశానవాటికలో నిలపడంతో తాము ఇబ్బంది పడుతున్నామని, వెంటనే వాటిని అక్కడ నుంచి తొలగించాలని స్థానికులు, టీడీపీ మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి కలిసి జోన్-5 కమిషనర్ రాముకు విజ్ఞప్తి చేశారు. వాహనాలు అక్కడ నిలపడం వల్ల మృతదేహంతో శ్మశానవాటికకు వచ్చేవారు, ఆ ప్రాంత కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఏఎంహెచ్ఓ సునీల్, పలువురు అధికారులతో కలిసి బుధవారం శ్మశానవాటికను పరిశీలించారు. పది రోజుల్లో వాహనాలను అక్కడ నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఇక్కడ విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మర్రిపాలెం, వుడాకాలనీ, అంబేడ్కర్‌నగర్, జ్యోతినగర్ తదితర సుమారు 10 కాలనీల ప్రజలు వినియోగించే శ్మశానవాటికలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని నర్సకుమారి అధికారులను కోరారు. శ్మశానవాటిక ప్రాంతంలో సుందరీకరణ పనులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో అన్ని వసతులు కల్పిస్తామని అధికారులు తెలిపారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు దస్తగిరి, జీవీఎంసీ జోన్-5 అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

దారుణం

... 5వ పేజీ తరువాయి

వ్యవహరిస్తున్నా, బెదిరింపులు కొనసాగిస్తున్నా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం, ఇంకా తగ్గకపోతే షీట్ తెరిచి జైల్లోనే ఉండేలా చేయడం చేసేందుకు అవకాశం ఉండేది. కానీ బాధిత యువతితోపాటు ఆమె తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు విముఖత చూపారు. కుటుంబం పరువుపోతుందనో..నిందితుడి జీవితం నాశనమైపోతుందనో భావించి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనాసరే పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. దీనిని అలుసుగా తీసుకున్న నిందితుడు నవీన్ బుధవారం కత్తితో నేరుగా యువతి ఇంటికి వెళ్లాడు. తన పెళ్లికి నిరాకరించిన యువతి తల్లిని కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం యువతిపై కూడా కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పరారైపోయాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సీపీ శంఖబ్రతబాగ్చి కూడా బాధిత కుటుంబంతో మాట్లాడిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ నిందితుడు నవీన్ పలుమార్లు బాధితురాలితో అతిగా ప్రవర్తించడం, బెదిరించడం, బలవంతంగా శ్రీకాకుళం జిల్లాకు తీసుకువెళ్లడం వంటి చర్యలకు పాల్పడినప్పుడైనా పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. ఎవరైనా ప్రేమ పేరుతో వెంటపడినా, పెళ్లి చేసుకోవాలని బలవంతం చేసినా, తాము చెప్పినట్టు వినకపోతే ప్రాణం తీస్తామని, దాడులు చేస్తామని, కుటుంబ సభ్యుల అంతుచూస్తామని బెదిరిస్తే వెంటనే కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలని సీపీ విజ్ఞప్తిచేశారు. తల్లిదండ్రులు తమకు ఎదురైనా ఇబ్బందిని లేదా భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించినప్పుడు డయల్ 100కి లేదంటే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే ఆకతాయిలు, దురుసుగా ప్రవర్తించే జులాయిల ఆటకట్టించేందుకు, తద్వారా బాలికలు, యువతులకు రక్షణ కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. బాధితులు కోరితే వారి వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరంగా రక్షణ కల్పిస్తామని సీపీ భరోసా ఇచ్చారు.

స్వయం ఉపాధి రుణాలకు పోటెత్తిన దరఖాస్తులు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేషన్‌కు కేటాయించిన 50 యూనిట్లకు 59 మంది, కాపు కార్పొరేషన్‌కు కేటాయించిన 452 యూనిట్లకు 655 మంది, మేదర/కుమ్మరి/శాలివాహన కార్పొరేషన్‌కు కేటాయించిన 123 యూనిట్లకుగాను 193 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు వడపోస్తున్నారు. జోన్లవారీగా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి రుణాలను మంజూరు చేయనున్నారు.

జనరిక్ మెడిసిన్ స్టోర్స్ ఏర్పాటుకు స్పందన నిల్

ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖలోని ఆయా కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటుచేయించాలని భావించింది. అయితే, జనరిక్ మెడికల్ స్టోర్స్ ఏర్పాటుకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. బీసీ కులాలకు చెందిన అభ్యర్థులకు జిల్లాలో 33 యూనిట్లు మంజూరుచేయగా 39 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఈబీసీ కులాలకు చెందిన యువత కోసం 36 యూనిట్లు మంజూరుచేయగా, ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అలాగే కమ్మ కార్పొరేషన్‌కు 14, రెడ్డి కార్పొరేషన్‌కు 40, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 50, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 17 యూనిట్లు మంజూరుచేయగా ఒక్క దరఖాస్తు అందలేదు. క్షత్రియ కార్పొరేషన్‌కు 21 యూనిట్లు మంజూరుకాగా, ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేశారు. మొత్తం జిల్లాకు ప్రభుత్వం 211 యూనిట్లు (జనరిక్ మెడిసిన్ స్టోర్లు) మంజూరు చేయగా, 40 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. యూనిట్ల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తులు రాకపోవడంతో ఏం చేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులపై అనుమానాలు

... 5వ పేజీ తరువాయి

వేశారు. ప్రస్తుతం ఆ సంస్థ వద్ద అన్ని నిధులు లేవు. గత వైసీపీ ప్రభుత్వం దాదాపు 80 శాతం నిధులు జగనన్న ఒక సెంటు ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి వాడేసుకుంది. దానికి ప్రత్యామ్నాయంగా భూములు ఇచ్చింది. వాటిని వేలం వేసి అమ్ముకోవాలని సలహా ఇచ్చింది. వీఎంఆర్‌డీఏ ప్రస్తుతం అదే పనిలో ఉంది. పాత లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లను వేలానికి పెట్టింది. ఇప్పుడు విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం అంత పెద్దగా లేదు. ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ వద్ద 300 గజాల ప్లాటు కొంటే కనీసం రూ.40 లక్షలు పెట్టాల్సి ఉంటుంది. ఇంటి స్థలానికి అంత వెచ్చించినా వెంటనే ఇల్లు కట్టుకునే పరిస్థితి ఆ లేఅవుట్లలో లేదు. భూమిపై పెట్టుబడి పెట్టే వారికే అవి ఉపయోగపడతాయి.

భూములు కోల్పోయే వారి పరిస్థితి?

ఈ 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి సుమారు 75 ఎకరాలు ఆయా ప్రాంతాల్లో ప్రజల నుంచి తీసుకోవలసి ఉంటుంది. వారు ఎవరో ఇప్పటివరకూ గుర్తించలేదు. వారికి నష్టపరిహారంగా డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. భూమికి భూమి ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. దానికి ప్రభుత్వ ఆమోదం ఉండాలి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం టీడీఆర్‌లు ఇవ్వాలనేది అధికారుల ఆలోచన. కానీ వాటిని కూడా ఏళ్లు గడుస్తున్నా బాధితులకు ఇవ్వడం లేదు. సింహాచలంలో బీఆర్‌టీఎస్ రహదారికి సంబంధించి ఇదే విషయమై వివాదం నడిచింది. ఇవేవీ పట్టించుకోకుండా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

వీసీ.. విభిన్నశైలి

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల తోనూ ఆయన మమేకమవుతున్నారు. తరగతులు జరుగుతున్న తీరు, బోధనలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారు. హాస్టళ్లలో భోజనం సరిగా లేదని చెప్పడంతో కొన్నింటిని ఆయన తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఒక్కో హాస్టల్ నుంచి భోజనం తెప్పించుకుని తింటున్నారు. కుటుంబ సభ్యులకు కూడా హాస్టల్ నుంచే భోజనం వెళుతోందని చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యత, రుచి వంటివి తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నది ఆయన భావన. అలాగే, గడిచిన కొద్దిరోజుల నుంచి సైన్స్ కాలేజీ పరిధిలోని మ్యాథ్స్ డిపార్టు మెంట్‌లో విద్యార్థులకు ఆయన పాఠాలు చెబు తున్నారు. వారంలో రెండు, మూడు క్లాసులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కొద్దిరోజుల్లో ఇంజ నీరింగ్ విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఆయన వెళ్లనున్నట్టు చెబుతున్నారు.

దూరంతో మేలు..

విభాగాల వారీగా తనిఖీలు ఉంటాయని, పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని గతం లోనే సూచించారు. దీంతో వీసీ ఎప్పుడు వస్తారో తెలియక అధికారులు విభాగాల్లోనే ఉంటున్నారు. ఆయన వచ్చే సమయానికి లేకపోతే ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో చాలామంది కనిపిస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా ఒక్కరే, అది కూడా సమాచారం లేకుండా వెళుతున్నారు. ఇది వర్సిటీలోని ఫ్యాకల్టీ, సిబ్బంది పనితీరును మెరుగుపర్చేందుకు దోహదం చేస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

... 5వ పేజీ తరువాయి

చెప్పాడు. సీఐ చింతా వాసునాయుడు కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని సివిల్ సప్లైస్ టీడీ కె.శ్రీనివాసరావుకు అప్పగించారు. అలాగే టూటౌన్ ఎస్ఐ డి.రాము ఆధ్వర్యంలో పోలీసులు గొల్లలపాలెం జంక్షన్ వద్ద బొలేరో వాహనంలో తరలిస్తున్న 50 కిలోల బరువు గల 80 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ బియ్యాన్ని పద్మనాభం మండలంలోని ఓ వ్యక్తికి అప్పగించేందుకు తరలిస్తున్నట్టు విచారణలో నిందితులు వెల్లడించారని పోలీసులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో వాహనాన్ని పౌర సరఫరాల విభాగానికి అప్పగించామన్నారు.

డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

ఇవ్వడంతో 19న జరిగే కౌన్సిల్ సమావేశంలోనే ఈ అంశం కూడా తేలిపోయే అవకాశం ఉందంటున్నారు. నోటీస్ అందజేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే జీవీఎంసీలో కూడా కూటమి పాలన ఉండాలని నగరవాసులు కోరుకుంటున్నారన్నారు. అందుకోసమే మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చామన్నారు. జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని, అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతోపాటు టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అప్పన్న పెళ్లికి రథసారధికి ఆహ్వానం



లక్ష్మణరావును ఆహ్వానిస్తున్న ఆనందకుమార్

సింహాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ఈ నెల 8న జరగనున్న వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవానికి ఆడపెళ్లి వారి తరపున మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అప్పన్న రథసారధి కదిరి లక్ష్మణరావును దేవస్థానం ఏఈఓ ఎన్.ఆనందకుమార్ ఆహ్వానించారు. బుధవారం ఆయన లక్ష్మణరావు నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి, దేవస్థానం తరపున అధికారిక లేఖను, ఆహ్వానపత్రికను, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. తమ పరివారంతో పాల్గొని, రథానికి సారథ్యం వహించి, ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11కేవీ సెయిల్ క్వార్టర్ ఫీడర్, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్, 11 కేవీ జేఆర్‌నగర్ ఫీడర్‌లు మద్దిలపాలెం సెక్షన్‌లో మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేఆర్‌నగర్, లాసన్స్ ప్రాంతం, వెంకోజీపాలెం, భానునగర్, ఇసుకతోట, వీరుబాబు గుడి, చాకలిపేట, రెల్లివీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పేర్కొన్నారు.

నవమి ఉత్సవ నిర్వాహకులకు బియ్యం వితరణ

» శ్రీరాములు చారిటబుల్ ట్రస్టు

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలోని 9 నుంచి 13వ వార్డుల్లో శ్రీరామనవమి ఉత్సవాలు చేపట్టే నిర్వాహకులకు అన్న ప్రసాదాల నిమిత్తం నాలుగు రైస్ బ్యాగులను అందిస్తున్నట్టు క్యాటరింగ్ రాజు (కాకి గంగరాజు) తెలిపారు. వి.జ్యూయలరీ సహకారంతో శ్రీరాములు చారిటబుల్ ట్రస్టు తరఫున ఈ రైస్ బ్యాగులు అందిస్తున్నట్టు ట్రస్టు అధినేత కాకి గంగరాజు (క్యాటరింగ్ రాజు) తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిమిత్తం తమను సంప్రదిస్తే ఉచితంగా నాలుగు రైస్ బ్యాగులను అందిస్తామని తెలిపారు. కల్యాణం నిర్వహించేవారు తమ ఉత్సవాలకు సంబంధించే కరపత్రం లేదా ఆహ్వాన పత్రికను చూపిస్తే సరిపోతుందన్నారు. తమ ట్రస్టు తరఫున అన్ని మతాలకు ఆదరిస్తామని అన్నారు. ఇటీవల రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్లు అందించినట్టు తెలిపారు. తాము తమ సిబ్బందితో రైస్ బ్యాగులను ఆయా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి అందిస్తామన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 95505 78107లో సంప్రదించాలన్నారు.

కేంద్ర కారాగారంలో ఖైదీలకు మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు

» జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎండాకాలం నేపథ్యంలో కేంద్ర కారాగారంలోని ఖైదీలకు గురువారం నుంచి మజ్జిగ అందించనున్నట్టు జైలు సూపరింటెండెంట్ ఎం.మహేశ్‌బాబు తెలిపారు. ఒక్కో ఖైదీకి సుమారు 250 ఎంఎల్ మజ్జిగ అందించనున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఖైదీలకు ఇస్తున్న ఏ కోటా కూడా తగ్గించలేదని చెప్పారు. అదనంగా మజ్జిగను అందించనున్నట్టు తెలిపారు. కేంద్రకారాగారంలోని డెయిరీనుంచి రోజుకు 60 లీటర్ల వరకు పాలు వస్తాయని, అదనంగా మరో 50 లీటర్లు పాలు విశాఖ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వేసవి ఎండలు తగ్గినంత వరకు మజ్జిగను ఖైదీలకు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 1900 మంది ఖైదీలు ఉన్నట్టు జైలు సూపరింటెండెంట్ తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ జైళ్లలో మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. దీనివల్ల ఖైదీలకు వేసవి నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

కొత్త స్కానర్లతో చకచకా పింఛన్ల పంపిణీ

- » గతంలో పాత స్కానర్లతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు
- » ఇప్పుడు త్వరితగతిన వేలిముద్రల స్కానింగ్
- » జోన్-3లో 98 శాతం పింఛన్ల పంపిణీ
- » రూ.6,38,58000 నగదు పంపిణీ
- » ఆస్పత్రులకు సైతం వెళ్లి పింఛను అందిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-3లో ఈ నెల వేలిముద్రల స్కానర్లు మొరాయించలేదు. వేలు పెట్టగానే బయోమెట్రిక్ అప్రూవ్ అయింది. దీంతో అందరు పింఛనుదారుల చేతికి డబ్బులు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం అందించన కొత్త వేలిముద్రల స్కానర్లతో ఏప్రిల్ పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు తప్పాయి. గత నెల వరకూకాలం చెల్లిన స్కానర్లతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వేలిముద్రలు వేయగానే స్కానర్లు మొరాయించడంతో వేరే సిబ్బంది వినియోగించే మరో స్కానర్ తెచ్చేవరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురయ్యేది. పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని ఓ పక్క అధికారుల ఒత్తిడి.. మరో పక్క స్కానర్ల మొరాయింపుతో సచివాలయ సిబ్బంది విధులు భారంగా నిర్వహించేవారు. ఈ నెల నుంచి అలాంటి సమస్యలు తలెత్తలేదు. స్కానర్ల సమస్యలు లేకపోవడంతో బాధ్యతగా చకాచకా పింఛన్లు పంపిణీ చేసేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న సచివాలయ కార్యదర్శి

జోన్-3లో 98 శాతం పంపిణీ..

జీవీఎంసీ జోన్-3లో 14,823 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతి నెలా వీరికి రూ.6,52,75,500 విడుదల చేస్తోంది. జోన్‌లోని 73 సచివాలయాల్లో పని చేస్తున్న 463 మంది కార్యదర్శులు ఈ పింఛన్ నగదును లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 1, 2వ తేదీల్లో చేపట్టిన పింఛన్ పంపిణీలో 98 శాతం పూర్తి చేశారు. అంటే 14,527 మందికి రూ.6,38,58,000 నగదు అందజేశారు. వేర్వేరు కారణాల వల్ల ఇంకా 368 మందికి పింఛన్ ఇవ్వాల్సి ఉంది. నిబంధనల ప్రకారం లబ్ధిదారుడు డోర్ నంబర్ మ్యాపింగ్ జరిగిన లొకేషన్‌కు 300 మీటర్లలోపే పింఛన్ అందివ్వాలి. కానీ కార్యదర్శులు చికిత్స తీసుకుంటున్న రోగులకు సైతం ఆస్పత్రులకు వెళ్లి ఫించన్ పంపిణీ చేశారు.మద్దిలపాలేనికి చెందిన వృద్ధుడు బోర శంకర్ ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిందటి నెల కూడా పింఛన్ తీసుకోలేదు. దీంతో మద్దిలపాలెం సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి మనోజ్.. ఆరా తీసి శంకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుసుకొని బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లి రెండు నెలల పింఛన్ రూ.8 వేలు వృద్ధుడికి అందించారు. దీంతో శంకర్ ఆనందం వ్యక్తం చేశాడు.

టీటీసీ వేసవి కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ వేసవి శిక్షణా కోర్సునకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మే నెల 1 నుంచి జూన్ నెల 11వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 25 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుడు మే నెల 1నాటికి 18 సంవత్సరాలు నిండి ఉం డాలని, 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు.

ఇవీ అర్హతలు :

1. పదో తరగతి ఉత్తీర్ణులై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులో లోయర్ పూర్తి చేసి ఉండాలి.
2. ఎస్సెస్సీ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.
3. బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ ఏపీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి
4. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ అండ్ ట్రైనింగ్ (ఎస్బీటీఈటీ), ఏపీ జారీ చేసిన సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
5. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
6. ఇండస్ట్రీస్ - కామర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ హ్యాండ్లూమ్ వీవింగ్ వారు జారీ చేసిన ఉత్తీర్ణత సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
7. తెలుగు విశ్వవిద్యాలయం జారీ చేసిన కర్నాటక మ్యూజిక్ (వోకల్ లేదా వీణ లేదా వయోలిన్) లలో డిప్లొమో సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
8. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ కలిగిఉండాలి.

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలో వెబ్‌సైటు :www.bse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని కోర్సు కేంద్రం ఏ జిల్లాలో ఎంపిక చేసుకొంటే ఆ జిల్లా డీఈవో కార్యాలయంలో అప్లికేషన్ ప్రింట్‌తో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు జత చేయాలన్నారు. వచ్చే నెల 1 నుంచి తరగతులకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ తెలిపారు.

7న ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, కార్మిక సమస్యలపై ఈ నెల 7వ తేదీన రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరగనున్నాయి. గత నెలలో మూడుసార్లు చర్చలు జరిగినా విఫలమవ్వడంతో వాయిడా పడ్డాయి. ఈ క్రమంలో కాంట్రాక్టు కార్మికులు ఒకరోజుసమ్మె కూడా చేశారు. చర్చలు వాయిదా పడినప్పటికీ కార్మికుల తొలగింపుపై ఉక్కు యాజమాన్యం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ క్రమంలో 7వ తేదీన జరగనున్న చర్చలు కీలకంగా మారనున్నాయి. ఈ చర్చల తరువాత కార్మికుల భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని కార్మిక నాయకులు తెలిపారు.

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్ర ఫౌండేషన్ సహకారంతో 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు గల డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెల్త్ కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు ఎంపికైన విద్యార్థులకు కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్, షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి క్యాంపస్‌లో 3 నెలల పాటు ఉచిత శిక్షణనిచ్చాక ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7207953919 సెల్‌నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అంగరంగ వైభవంగా పోలమాంబ అమ్మవారి జాతర

- » అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- » ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

పెదవాల్తేరు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని వెలసిన శ్రీకరక చెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని తూర్పు నియోజక వర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలో గల తన కార్యాలయంలో శ్రీకరక చెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజక వర్గంలోని 14 గ్రామాల ప్రజలు కరకచెట్టు పోలమాంబ అమ్మవారిని ఆరాధ్య దేవతగా కొలుస్తారన్నారు. ప్రతి ఏటా అమ్మ వారి జాతర నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.గాయత్రి, టీడీపీ నాయకులు పీతల అమరేంద్ర, కాళ్ళ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులతో రూ.27.8 లక్షల ఆదాయం

విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రకారాగారంలో గల వివిధ పరిశ్రమలు, ఆదాయ వనరుల నుంచి ఈ ఏడాది పెట్టుబడిపోను రూ.27 లక్షల 80 వేల నికరాదాయం వచ్చినట్టు విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ఎం.మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన బుధవార విలేకరులకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్టీలు ఉత్పత్తుల నుంచి రూ. 1 కోటి 35 లక్షల వ్యాపారం జరిగిందన్నారు. ఆ ఉత్పత్తుల నుంచి రూ.17 లక్షల ఆదాయం వచ్చినట్టు చెప్పారు. అదేవిధంగా చేనేత నుంచి రూ.15 లక్షల అమ్మకాలు జరగగా, సుమారు రూ.1.60 ఆదాయం సమకూరినట్టు తెలిపారు. బ్యాకరీల నుంచి రూ రెండు లక్షల ఆదాయం సమకూరిందన్నారు. అలాగే అగ్రికల్చర్ నుంచి సుమారు రూ1.2 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఉత్పత్తులు ఖైదీలు తయారు చేసినవేనని తెలిపారు. వ్యవసాయం చేయడం, మగ్గాలపై వస్త్రాలు నేయడం, నవారులు మగ్గాలపె నేయడం, ఇనుప బీరువాలు, కుర్చీలు తయారు చేయడం వంటి పనులు ఇక్కడ చేస్తారన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే వస్తువులు అధికంగా ఎల్ అండ్ టీ కంపెనీ కొనుగోలు చేస్తుందని చెప్పారు. అలాగే ఆర్డర్లపై ప్రభుత్వ కార్యాలయాల కోసం ఆయా వస్తువులు రూపొందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా బ్యాకరీల నుంచి వివిధ రకాల బ్యాకరీ ఉత్పత్తులు తయారు చేసి జైలు బయట గల స్వధార్ క్యాంటీన్‌లో అమ్మకాలు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయానికి సంబంధించిన భూముల్లో వివిధ కూరగాయల సాగు చేసి విక్రయాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆయా వనరులు, ఆదాయ మార్గాల ద్వారా రూ.27 లక్షల 80 వేల ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

రక్షణ కోరిన వైసీపీ కార్పొరేటర్లు ఎక్కడ ఉన్నారు?

» జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



సీతంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రక్షణ కోరిన వైసీపీ కార్పొరేటర్లు ఎక్కడ ఉన్నారో తెలపాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ మేయర్ అవిశ్వాస తీర్మానం వ్యవహారంపై ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా? అని అడిగారు. కూటమి క్యాంప్ రాజకీయాలు అనడం కంటే క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టింది మీరే అన్నారు. మీ కాంప్‌లో ఉన్నవారికి రక్షణ లేదని అంటే మీ నుంచి ప్రాణహాని ఉందా? అన్ని ప్రశ్నించారు. బడ్జెట్ మీటింగ్‌కు కూడా రాకుండా ఏమైపోయారో పోలీసులు విచారణ చెయ్యాలన్నారు. కూటమి పార్టీలపై బురద జల్లడం మానుకోవాలన్నారు. 19న సాయంత్రం అన్ని లెక్కలు తేలుతాయని, అందరి చిట్టాలు బయట పడతాయన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో కుటుంబాలను కిడ్నాప్ చేసి, నామినేషన్ ఉపసంహరింపజేసినప్పుడు ఈ పారదర్శకత వ్యాఖ్యలు ఏమయ్యాయని మూర్తియాదవ్ ప్రశ్నించారు. బెంగళూరు లోటస్ పాండ్‌లో కార్పొరేటర్లను పెట్టి కాపలాకు ఆంధ్రా పోలీసులు కావాలని అడగడం సిగ్గు చేటన్నారు. ఈ వంకన జగన్‌కు సెక్యూరిటీ అడుగుతున్నారా? చెప్పాలని అమర్‌ను ప్రశ్నిస్తున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత



మృతుడి కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం శెట్టిబలిజ వీధికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కేసుబోయిన రాము ఇటీవల మరణించడంతో ఆయన భార్య కేసుబోయిన నందినికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షలు ఆర్థిక సహాయం మంజూరైంది.

ఈ చెక్కును బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన కార్యాలయంలో రాము కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, నాయకులు బోర ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, కాళ్ల శంకర్, బొట్టా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : జీవీఎంసీ 21వ వార్డు చిన వాల్తేరు నేతాజీనగర్‌కు చెందిన అల్లాడి సురేష్ (26) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతి చెందారు. అతడి కుటుంబానికి రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్‌ను బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృషబాబు మృతుడి కుటుం బ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర, 21వ వార్డు టీడీపీ అధ్యక్షులు పీతల అమరేంద్ర, పీతల అవినాష్ యాదవ్, ధర్మ, సురేష్, మూర్తి, వినయ్, వెంకటరావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాలు, సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వివిధ ఎస్సీ సంఘాలు, సంస్థల ప్రతినిధులు, అధికారులు

ఎంవీపీ కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని వివిధ ఎస్సీ సంఘాలు, సంస్థల ప్రతినిధులతో అధికారులు కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని బుద్ధ భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులకు ఎస్సీకార్పొరేషన్ ద్వారా అమలయ్యే పథకాలు, రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను అధికారులు వివరించారు. డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బి.కల్యాణరావు, విదసం అధ్యక్షులు బూసి వెంకటరావు, డీవీఎంసీ సభ్యులు పి.మల్లేశ్వరరావు, సీహెచ్ రాంబాబు, ఎస్.శ్రీనివాసరావు, జి.ఆంజనేయ, డి.శామ్యూల్, మాల మహానాడు నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్ నాయకుడు పి.రాంబాబు, ప్రొఫెసర్ సుబ్బారాయుడు, జోసెఫ్, సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల కోసం చినగదిలి నార్త్ షిర్డీ ఆలయం ప్రాంగణంలో సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవం నిమిత్తం పెండ్లి రాట కార్యక్రమం బుధవారం చేపట్టారు. వేద పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య సంప్రదాయబద్ధంగా పందిరి రాట వేశారు.

శుక్రవారం ఉదయం నుంచి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, శుక్రశనివారాల్లో విశేష హోమాలు, ఆరవ తేదీన స్వామివారి కల్యాణ ఉత్సవం, 6వ తేది సాయింత్ర రామచంద్రుడి పట్టాభిషేక నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ ట్రస్టీ వానపల్లి అప్పారావు దంపతులు, రామనవమి ఉత్సవ కమిటీ భ్యులు బుడ్డిగ సత్యనారాయణ దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



వీర్రాజు, దుర్గాప్రసాద్‌లను సన్మానిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏలో 36 సంవత్సరాల పాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పి.వీర్రాజు, పి.దుర్గాప్రసాద్‌లను వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంకితభావం, పట్టుదల, నిబద్ధతతో అందించిన సేవలు సహోద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.

కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, డీఎఫ్ఓ శివానీ సుజాత, సీఏఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో తీరని సమస్యగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు



తవ్వి వదిలేయడంతో అధ్వానంగా ఉన్న రహదారి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో తీరని సమస్యగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మిగిలిపోయింది. వార్డులో గత పదేళ్లుగా ఈ సమస్య కొనసాగుతూనే ఉంది. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఈ సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. పాత వెంకోజీపాలెంలో జంక్షన్‌లో కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇక్కడ మంచినీటి ప్రధాన పైపులైను ఉండడం కారణంగా నేరుగా దిగువ ప్రాంతానికి కనెక్షన్ ఇవ్వకుండా మలుపు త్రిప్పారు. దీంతో కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే జోరుకి మురుగునీరు మలుపు తిరిగే చోట అడ్డంకులు ఉంటే మురుగునీరంతా పొంగిపొర్లుతూ దిగువ ప్రాంతంలోకి వరదలా పారుతుంది. దీని వలన ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు, పాదచారులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ మురుగు నీరు నేరుగా దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి కూడా చేరుతుంది. ఇదిలావుండగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు పాత వెంకోజీపాలెం గవర వీధిలో నూతనంగా పైపులైనును వేశారు. అయితే దీని కోసం తవ్విన గోతులను మాత్రం సంపూర్ణంగా మూసివేయకుండా వదిలేశారు. గత రెండు నెలలుగా ఇదే సమస్య కొనసాగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసలే ఇరుకు రోడ్లు, అందులోనూ గోతులు కారణంగా చిన్నారులు నుంచి పెద్దల వరకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై శాశ్వత పరిష్కారాన్ని చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకున్న నాథుడే కరువు



ప్రధాన మార్గంలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిరీక్షణ జాబితా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు ఈ నెల 30 వరకు తాత్కాలిక అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ (18526/18525) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు జనరల్ సీటింగ్ కోచ్‌లు, విశాఖ-రాయపూర్-విశాఖ (58528/58527), విశాఖ-కొరాపుట్-విశాఖ (58538/58537), విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ (58532/58531), విశాఖ-భవానీపట్నా-విశాఖ (58504/58503) పాసింజర్ రైళ్లకు ఒక్కో జనరల్ సీటింగ్ కోచ్ జత చేస్తామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుమల విద్యా సంస్థలో అవగాహనా సదస్సు రేపు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై ఐదు నుంచి పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్టు సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజువల తాళ్లవలస క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇంటర్‌తో పాటు జేఈఈ మెయిన్స్ , అడ్వాన్స్ వంటి ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ లాంటి అత్యుత్తమ యూనివర్సిటీల్లో సీటు సంపాదించాలంటే ఏ విధంగా సంసిద్ధమవ్వాల్లో ఈ సదస్సులో వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 9848986450, 9848986451 నంబర్లలో సంప్రతించవచ్చునని పేర్కొన్నారు.

అప్పన్న వార్షిక కల్యాణానికి మంచి ముత్యాలు కానుక


ముత్యాలను అందిస్తున్న శివశంకరరాజు

సింహాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 8వ తేదీ రాత్రి జరగనున్న వార్షిక తిరు కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మీ డైమండ్స్ అధినేత వి. శివశంకర రాజు సుమారు నాలుగు కిలోల మంచి ముత్యాలను కానుకగా సమర్పించారు. బుధవారం ఆయన ఆలయ బేడా మండపంలో వీటిని పర్యవేక్షణాధికారి ప్రసాద్‌కు అందించారు. ఆలయ ఆచారం ప్రకారం దాతను అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి పదోతరగతి మూల్యాంకనం

జ్ఞానాపురం జూబ్లీ హైస్కూల్లో ఏర్పాట్లు


సిబ్బందికి సూచనలిస్తున్న డీఈవో

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం నుంచి జ్ఞానాపురంలోని జూబ్లీ ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానున్నాయి. ఈనెల తొమ్మిదోతేదీ వరకు జరగనున్న మూల్యాంకనం కోసం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు 1.8 లక్షల జవాబుపత్రాలు జిల్లాకు వచ్చాయి. మూల్యాంకనానికి సుమారు 1,200 మంది ఉపాధ్యాయులను నియమించారు. అయితే కొన్ని సబ్జెక్టులకు టీచర్ల కొరత ఉన్నందున పొరుగున ఉన్న అనకాపల్లి జిల్లా నుంచి టీచర్ల సేవలు కావాలని డీఈవో కోరారు. దీనిపై అనకాపల్లి జిల్లా విద్యాశాఖ నుంచి ఇంకా స్పందనరాలేదు. బహుశా అనకాపల్లి జిల్లాలో నిర్వహించే మూల్యాంకనానికి సరిపడా టీచర్లను నియమించడం, పాఠశాలల బోధనకు మరికొందరు టీచర్లను కొనసాగించిన తరువాత మాత్రమే విశాఖ జిల్లాకు టీచర్లను పంపే అవకాశం ఉంది. మూల్యాంకన కేంద్రానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ క్యాంపు అధికారిగా వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం డీఈవో జూబ్లీ హైస్కూల్‌కు వెళ్లి మూల్యాంకన ఏర్పాట్లు పరిశీలించి అక్కడ సిబ్బందికి సూచనలు చేశారు.

భగ్గుమన్న సూరీడు


కొబ్బరి బొండాలతో సేద తీరుతూ

ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు అదరగొడుతున్నాయి. నగరంలో బుధవారం సూర్యుడి ప్రతాపానికి జనం అల్లాడిపోయారు. అత్యవసర పనులపై బయటకు వచ్చినవారంతా ఎండ నుంచి రక్షణగా వస్త్రాలను కప్పుకుని ప్రయాణించాల్సి వచ్చింది. మరోవైపు వేసవి తాపంతో కొంత మంది శీతల పానీయాలు, కొబ్బరిబొండాలను ఆశ్రయించారు. మధ్యాహ్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల గురజాడ కూడలి దాదాపుగా నిర్మానుష్యంగా మారింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ముఖానికి చున్నీలతో రక్షణ


మండే ఎండలో ద్విచక్రవాహనంపై ప్రయాణం


నిర్మానుష్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ కూడలి

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

» బీఏఐ ఏపీ, తెలంగాణ, కర్నాటక రీజియన్ ట్రస్టీ రామకోటయ్య


రామకోటయ్యను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) ట్రస్టీ చెరువు రామకోటయ్య చెప్పారు. ఇటీవల ఆయన ఏపీ, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలతో కూడిన రీజియన్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను బీఏఐ సభ్యులు సిరిపురం కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-27 వరకు తాను ట్రస్టీ పదవిలో ఉంటానని, కాంట్రాక్ట్ ఒప్పందాలను స్థిరీకరించడం, అస్థిర మార్కెట్ హెచ్చు తగ్గుల నుంచి కాంట్రాక్టర్లకు రక్షణ కల్పించడానికి ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఏఐ అధ్యక్షులు నవనీత్, కార్యదర్శి ఎంఎస్ మూర్తి, కోశాధికారి జీవీ సుబ్బారావు, పూర్వ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం

» ఈనెల తొమ్మిదో తేదీ వరకు నిర్వహణ


చినముషిడివాడ అయాన్ డిజిటల్ కేంద్రం వద్ద పరీక్షకు వచ్చిన విద్యార్థులు


విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ/ఎన్ఐటీ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండోవిడత పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.చినముషిడివాడ ఐయాన్ డిజిటల్స్ కేంద్రాల్లో ఈనెల తొమ్మిదో తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఎనిమిదో తేదీ వరకు బిటెక్/బీఈ, తొమ్మిదోతేదీన బి.ఆర్క్/ప్లానింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. రెండు కేంద్రాలు కలిపి రోజుకు 1,300 మందిని కేటాయించారు. కాగా తొలి రోజు పరీక్షలకు 1,259 మంది హాజరయ్యారని రీజనల్ కోఆర్డినేటరు, విశాఖ వ్యాలీ స్కూలు ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

ప్రకృతి విపత్తులపై బీచ్ రోడ్డులో మాక్ డ్రిల్


విపత్తులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న సిబ్బంది


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

మహారాణిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాద ఘటనలను ఎలా ఎదుర్కోవాలి? అనే అంశంపై అవగాహన కల్పిస్తూ జిల్లా ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జబ్బర్‌తోట వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. సునామీ, తుపాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో, ఎంత జాగ్రత్తగా ఉండాలో డీపీఎం కళావతి సమక్షంలో ప్రజలకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, పరిశ్రమలు, పౌరసరఫరాలు, పశుసంవర్ధక, ఏపీఈపీడీసీఎల్, గ్రామీణ నీటిసరఫరా, కాలుష్య నియంత్రణ మండలి, ప్రజారోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ రేషన్ డీలర్లకు ఐరిస్‌తో చెక్

పౌరసరఫరాల కమిషనర్ అనుమతి ప్రతిపాదనలు

జిల్లా యంత్రాంగం యోచన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ రేషన్ డీలర్ల వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తోంది. ఒరిజినల్ డీలరు వేలిముద్రకు పోలినట్టుగా నకిలీ వేలిముద్రలతో డిపోల నిర్వహణకు చెక్ చెప్పాలని నిర్ణయించారు. 'నకిలీ డీలర్ల అడ్డగోలు వ్యవహారం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జేసీ మయూర్ అశోక్ స్పందించారు. పౌరసరఫరాల సంస్థ గోదాముల్లో స్టాకు తీసుకున్నప్పటి నుంచి వీధుల్లో కార్డుదారులకు సరకుల పంపిణీ కోసం ఎండీయూలకు అందే ఇచ్చే సమయం వరకు ఐరిస్ విధానం అమలుచేయాలని యోచిస్తున్నారు.

ఇప్పటివరకు బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రతో లాగిన్ అవుతున్నారు. ఈ ప్రక్రియలో అవకతకలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో ఐరిస్ అమలుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విధానం వల్ల నకిలీ డీలర్లు, నకిలీ వేలిముద్రల బెడద పూర్తిగా తొలగిపోతుందని అంచనాకు వచ్చారు. వేలిముద్ర వేయడానికి ప్రత్యామ్నాయంగా కొవ్వొత్తి, ఫెవికాల్ తదితర కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో సులువుగా బయోమెట్రిక్ వేయడంతో ఒరిజినల్ డీలరుకు బదులు నకిలీ డీలర్లు డిపోలు నిర్వహిస్తున్నారు. అదే ఒరిజినల్ డీలరు కళ్లకు (ఐరిస్) స్కానింగ్ చేస్తే నకిలీలకు చెక్ పడుతుందని భావించారు. అయితే ఈ విధానం కేవలం డీలర్లు/ ఎండీయూలకు మాత్రమే అమలుచేయాలి తప్ప కార్డుదారులకు వర్తింపచేస్తే సరకుల పంపిణీలో జాప్యం జరుగుతుంది. బయోమెట్రిక్ విధానం రద్దుచేసి ఐరిస్ తీసుకురావాలంటే పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనుమతి అవసరం. ఈ నేపథ్యంలో అనుమతి కోసం ప్రతిపాదిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వెల్లడించారు.

ఆరు నెలల్లో రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

» గంగసాని అగ్రహారంలో లేఅవుట్ పనులకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగసాని అగ్రహారంలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌లో ప్లాట్లను ఆరు నెలల్లో రైతులకు అందజేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన లేఅవుట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి పరిష్కారం కాని రైతుల సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం చూపించామని తెలిపారు. 2016లో వీఎంఆర్‌డీఏ సేకరించిన 245 ఎకరాల్లో మొదటి విడతగా రైతుల కోసం 85 ఎకరాల్లో అన్ని హంగులతో లేఅవుట్ తయారవుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి రామవరం వచ్చినప్పుడు వీఎంఆర్ డీఏ తీసుకున్న భూముల సమస్య, జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డు కావాలని అడిగారని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఈ రెండు హామీలను తీర్చడం ఆనందంగా ఉందని చెప్పారు. 10 వేల నుంచి 15 వేల మంది యువతకు ఉపాధి కల్పించే ఐటీ పరిశ్రమను తర్లువాడ సమీపంలోని 200 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే భూ సేకరణ పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. రూ. 8 వేల జీతం కోసం ఈ ప్రాంత మహిళలు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతానికి వెళ్తున్నారని, ఇక్కడికి పరిశ్రమలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు నెల రోజుల్లో ఎల్‌పీసీలు ఇస్తామని, ఈ తర్వాత 20 రోజులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, బీజేపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రామానాయుడు, సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, కాకర్లపూడి వరహాలరాజు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లోనే ఇంటర్ ఫలితాలు

» పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

» 15వ తేదీలోగా ఫలితాల విడుదలకు సన్నాహాలు

» జిల్లాలో పరీక్షలు రాసిన 82,565 మంది విద్యార్థులు

మద్దిలపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వచ్చే వారం విడుదల కానున్నాయి. ఈ దఫా ఫలితాల కోసం విద్యార్థులు హాల్ టికెట్లు తీసుకుని నెట్‌సెంటర్లకు వెళ్లనవసరం లేదు. డిజిటల్ పరివర్తనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్షల ఫలితాలను నేరుగా వాట్సాప్‌లోనే విడుదల చేయనుంది. అందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 12, 15 తేదీల మధ్య ఫలితాలు ప్రకటించేందుకు వీలుగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 82,565 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. గత నెల ఏడో తేదీ నుంచి మహిళా ప్రభుత్వ కళాశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఆరో తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సివుంది. అయితే సబ్జెక్టు అధ్యాపకుల కొరతతో రెండు మూడు రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత జవాబు పత్రాల కంప్యూటరీకరణ చేపడతారు. ఈ ఏడాది మార్కుల జాబితాను పీడీఎఫ్ రూపంలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మార్కులను స్కాన్ చేసి పీడీఎఫ్ ఫార్మాట్‌లోకి మార్చాల్సివుంది. ఇవన్నీ జరగడానికి మరో ఐదారు రోజుల సమయం పడుతుంది.

ఫోన్‌లోనే మార్కుల షార్ట్ మెమోలు

రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లు వాట్సాప్‌లో అందించింది. తాజాగా ఇంటర్ ఫలితాలు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించనుంది. అంతేకాకుండా కళాశాలల్లో చేరేటప్పుడు విద్యార్థులు నమోదు చేసుకున్న ఫోన్ నంబరు వాట్సాప్‌కు కూడా ఫలితాలు పంపించే ఏర్పాట్లు చేశారు. ఒకవేళ ప్రభుత్వ వాట్సాప్ సేవల్లో తెలుసుకోవాలంటే 95523 00009 నంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలి. వచ్చిన ఆప్షన్స్‌లో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఎంపిక చేసుకుంటే ఇంటర్ ఫలితాలు 2025 అని వస్తుంది. ఆ ఆప్షన్‌పై క్లిక్ చేసి, హాల్ టికెట్ నంబరు ఎంటర్ చేస్తే పీడీఎఫ్ ఫార్మాట్‌లో విద్యార్థి రిజల్ట్ కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని షార్ట్ మెమో కింద వినియోగించుకోవచ్చు.

క్రైం... crime news

భార్య ప్రాణం తీసిన క్షణికావేశం


రమాదేవి (ఫైల్ ఫొటో)

మహారాణీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భర్త క్షణికావేశం భార్య నిండు ప్రాణాన్ని బలిగొంది. ఈ ఘటన టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.వివరాల్లోకి వెళ్తే..బంగార్రాజు, రమాదేవి దంపతులు విశాఖ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో డాన్సర్స్‌గా చేస్తూ మాధవధారలో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య గొడవలు జరగడంతో అల్లిపురంలోని వెంకటేశ్వరమెట్ట వద్ద గల తల్లి దగ్గరకు రమాదేవి వచ్చింది. బంగార్రాజు అక్కడికి వచ్చి గొడవ పెట్టుకున్నాడు. మూడు రోజుల కిందట టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రమాదేవికి, బంగార్రాజుకు మాటామాటా పెరిగి క్షణికావేశంలో ఆమెను కొట్టాడు. పక్కనే ఉన్న ఇనుపరాడ్డు తగలడంతో రమాదేవి గాయపడింది. కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానిక రాజేంద్రనగర్‌లో జరిగింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. రాజేంద్రనగర్‌లోని ఓ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి తలుపులు తెరచి చూడగా, ఒక వ్యక్తి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మచ్చా రాము (41)గా గుర్తించారు. వారం, పది రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా అతడు జీవీఎంసీ యూజీడీ విభాగంలో కూలీగా పని చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. అవివాహితుడని, ఇటీవల తల్లి మృతి చెందిందని చెప్పారు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎస్ఐ రాందాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు రూ.2 లక్షల జరిమానా

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 20 మందికి రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మందుబాబులను బుధవారం లోక్ అదాలత్‌లో స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు తెలిపారు. ఒకరికి పది రోజుల జైలు శిక్ష వేశారన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.6 లక్షలు మోసం

పెందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి నుంచి రూ.6 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా ఓ విద్యాసంస్థకు చెందిన వ్యక్తి తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశాడని షైలపల్లి మూర్తి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు మూర్తి తన కుమారుడు హరీశ్ ఉద్యోగం కోసం పెందుర్తిలోని ఓ విద్యాసంస్థకు చెందిన సీర నాయుడుకు 2021లో మూడు విడతలుగా రూ.6 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం రాకపోగా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

మతి స్థిమితం లేని యువతిపై అత్యాచారం

కంచరపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ యువతిపై అత్యాచారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పట్టాభితోటలో తల్లిదండ్రులతో కలిసి ఓ యువతి (29) నివసిస్తోంది. రోడ్లపై తిరుగుతూ తనలో తాను మాట్లాడుకుంటూ, నవ్వుతూ వెళ్తూ ఉండేది. ఎవరినీ ఏమీ అనేది కాదని స్థానికులు చెప్పారు. గత నెల 29న బర్మాక్యాంప్ నూకాలమ్మ ఆలయం వైపు వెళ్లిన ఆమెను కాగితాలు ఏరుకునే ఓ వ్యక్తి పెళ్లి చేసుకుంటానంటూ చెరకు రసం విక్రయించే బండి దగ్గరకు తీసుకెళ్లి చెరకు రసం తాగించాడు. కొంతసేపటి తర్వాత ఆమెను సీఐఎస్ఎఫ్ క్వార్టర్ వైపు శ్రీనివాసనగర్ సమీపంలో ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అధిక రక్తస్రావం కావడంతో ఆమె తల్లిదండ్రులు బుధవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఎస్ఐ దివ్యభారతి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

డ్రోన్ల వినియోగంపై పోలీసులకు విస్తృత శిక్షణ


శిక్షణను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తీరంలో నిరంతరం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్న పోలీస్ శాఖ ఆధునిక పరిజ్ఞానాన్ని ఉప యోగించుకుంటోంది. ఈ క్రమంలో డ్రోన్‌ల వినియోగానికి కసరత్తు చేస్తోంది. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తోంది ఈ నేపథ్యంలో పోలీస్ సిబ్బందికి డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించేందుకు డ్రోన్లు ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికి 55 మంది సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామన్నారు.

13న వేంకటేశ్వరస్వామి వ్రతం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న వేంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రచార బ్యానర్‌ను విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు బృందాలతో కల్యాణం నిర్వహిస్తామన్నారు. మొదటి బృందం ఉదయం 8.30 గంటలకు, రెండో బృందంతో ఉదయం 11 గంటలకు వ్రతం చేయిస్తామన్నారు. పాల్గొనాలని భావించే భక్తులు ముందుగా తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని టీటీడీ అధికారులు తెలిపారు. ఇతర వివరాలకు 9866239942, 8500641729లో నంబర్లలో సంప్రతించాలన్నారు.

నేడు విశాఖ ఆర్చ్ బిషప్ బాధ్యతల స్వీకరణ


అగ్ర పీఠాధిపతి బాల

మహారాణిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీఎం చర్చ్‌ల విశాఖ అగ్ర పీఠానికి ఆర్చ్ బిషప్‌గా డాక్టర్ ఉడుమల బాల గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు బిషప్ పొలిమేర జయరావ్ తెలిపారు. మహారాణిపేటలోని పునీత ఆంథోని చర్చిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పోప్ ఫ్రాన్సిస్ ప్రతినిధి, భారత్-నేపాల్ అపోస్టోలిక్ నున్సియో (అంబాసిడర్), ప్రాతినిధ్యం వహిస్తున్న మోస్ట్ రెవరెండ్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి చేతులమీదుగా ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. ప్రముఖులు హాజరవుతారన్నారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్, మోస్ట్ రెవరెండ్ కార్డినల్ ఆంథోని పూలా అధ్యక్షత వహిస్తారని సాయంత్రం 4 గంటలకు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ చర్చి నుంచి పునీత పేతురు ప్రధాన చర్చి వరకు ప్రదక్షిణ జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి బిషప్‌లు, ఫాదర్లు, కన్యస్త్రీలు, విశ్వాసులు పాల్గొంటారన్నారు. సమావేశంలో దుగ్గింపూడి బాలశౌరి, జొన్నాడ జాన్‌ప్రకాశ్, కోన జయరాజు, బి.సురేష్‌బాబు, సిస్టర్ సాండ్రినా, సిస్టర్ నీలప్పన రోజ్, ప్రదీప్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.